తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

RNI NO.TELTEL / 2013 /50370




# జనంసాక్షి




www.janamsakshi.org

మంగళవారం 02.06.2026 | సంపుటి : 12 సంచిక : 313 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# తరాల తండ్లాట

సంపాదకీయం

తెలంగాణ ఉద్యమం కేవలం ఒక రాజకీయ పోరాటం మాత్రమే కాదు అది తరాల తరబడి రగిలిన ఆత్మగౌరవ జ్వాల. 1968లో విద్యార్థి లోకం తొలిసారిగా గొంతెత్తినప్పుడు, అది అణచివేతకు గురైంది. కానీ అణచివేత విత్తనాన్ని నాశనం చేయలేదు. భూమి పొరల్లో అది మరింత లోతుగా పాతుకుపోయింది. తెలంగాణ జనసభ నాటి బెల్లి లలిత హత్య, గద్దర్‌పై జరిగిన కాల్పులు ఆ విత్తనాలకు నీరు పోశాయి. ఆకాంక్ష మళ్ళీ మళ్ళీ తెరపైకి వచ్చింది.

2001లో సింహగర్జనతో పురుడుపోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి ఆ ఆకాంక్షకు రాజకీయ రూపం ఇచ్చింది. ఉద్యమం ఉధృతమవుతున్న సమయంలో రోశయ్య సర్కార్ హైదరాబాదును ఫ్రీ జోన్‌గా ప్రకటించడం పాలకుల దిగ్భ్రాంతికి అద్దం పట్టింది. సిద్దిపేట వైపు దీక్షకు బయలుదేరిన కేసీఆర్‌ను కరీంనగర్ వద్దే అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించారు. ఆ అరెస్ట్ ఉద్యమాన్ని ఆపలేదు. మరింత రగిలించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యార్థి ఉద్యమం ఎగసిపడింది. విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సింగరేణి కార్మికులు, సకల జనులు జేఏసీలుగా ఏకమై గొంతెత్తారు. కవులు కళాకారులు, సబ్బండ వర్గాలు తమ తమ భాషల్లో తెలంగాణను పాడారు, చాటారు, నిలబెట్టారు.

ప్రొఫెసర్ జయశంకర్ అకుంఠిత పరిశోధనతో తెలంగాణ వాదానికి మేధో పునాది వేశారు. కాళోజీ నారాయణరావు తన కవిత్వంతో ప్రజల గుండెల్లో తెలంగాణను బతికించారు. వారిద్దరూ ఈ ఉద్యమానికి కేవలం నేతలు కాదు. దిక్సూచులు. వారు చూపిన దిశలో నడిచి, 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ కల సాకారమైంది. పార్లమెంటులో బెల్లు మోగించడం ద్వారా సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చారు.

అయితే భౌగోళిక తెలంగాణ ఏర్పడటం పోరాటానికి పరిసమాప్తి కాదు. విద్య, ఉద్యోగం, పారిశ్రామిక వనరులు, అభివృద్ధి అవకాశాలు, అన్ని రంగాల్లోనూ తెలంగాణ బిడ్డలకు న్యాయమైన వాటా ఇంకా పూర్తిగా దక్కలేదు. తరాల త్యాగాల ఫలం కేవలం మ్యాపుపై ఒక గీతగా మిగిలిపోకూడదు. అది ప్రతి తెలంగాణ బిడ్డ జీవితంలో కనిపించాలి. అప్పుడే ఆ పోరాటానికి సార్థకత.

తెలంగాణ సాధన ఒక అధ్యాయం ముగిసింది. నిజమైన తెలంగాణ నిర్మాణం మరో అధ్యాయానికి తెర తీసింది.

# పాటతోనే, అక్షరంతోనే బతికిన పోరాటం

*తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రను "ఒకసారి గుర్తు చేసుకుందామా!!" అని వెనక్కి తిరిగి చూస్తే... అది కేవలం రాజకీయ వేదికల మీదో, పార్లమెంట్ గోడల మధ్యనో సాగిన వ్యవహారం కాదు. అది ఒక జాతి తన అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం చేసిన సాంస్కృతిక, అక్షర విప్లవం. రాజకీయ నాయకులు మాట్లాడటానికి భయపడిన రోజుల్లో, తుపాకీ గుళ్లకు గుండెలను ఎదురొడ్డి ప్రజా సంఘాలు ముందు నిలిచాయి. కళాకారులు తమ గజ్జె కట్టి, డప్పుల మోతతో పాలకుల నిద్రమత్తు వదిలించారు. సాంస్కృతిక చైతన్యమే తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసింది. పాట, సాహిత్య సంకలనాలు లేకపోతే తెలంగాణ మలిదశ ఉద్యమమే లేదు.*

జనంసాక్షి

**1. సామాజిక ఉద్యమాల పునాది: తెలంగాణ జనసభ, మారోజు వీరన్న గర్జన**

1990వ దశకం మధ్యలో, అప్పటివరకు నివురు గప్పిన నిప్పులా ఉన్న తెలంగాణ ఆకాంక్షను ప్రజా సంఘాలు మళ్లీ రాజేశాయి. రాజకీయ పక్షాలు మౌనంగా ఉన్న కాలంలో సామాజిక శక్తులు మేల్కొన్నాయి.

**మారోజు వీరన్న - చారిత్రక సూర్యాపేట సభ.**

తెలంగాణ సామాజిక, రాజకీయ ఉద్యమ చరిత్రలో అమరవీరుడు మారోజు వీరన్న పోషించిన పాత్ర మరువలేనిది. 1997 పల్లె పల్లెనా ఉద్యమ సెగలు రేగుతున్న తరుణంలో, ఆయన నేతృత్వంలోని 'తెలంగాణ మహాసభ' ఆధ్వర్యంలో 1997 ఆగస్టు 11న నల్గొండ జిల్లా సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన "తెలంగాణ రాష్ట్ర సదస్సు" (సూర్యాపేట డిక్లరేషన్) ఒక సంచలనం. "దళిత, బహుజన రాజ్యంతోనే సామాజిక తెలంగాణ విముక్తి సాధ్యం" అని వీరన్న ఆ సభలో ప్రకటించారు. వలస పాలకుల దోపిడీని ఎండగడుతూ ఆయన చేసిన ప్రసంగాలు, ఆ సభకు తరలివచ్చిన వేలాది మంది జనంలో స్వరాష్ట్ర కాంక్షను నరనరాల్లోకి ఎక్కించాయి. మలిదశ ఉద్యమానికి ఒక స్పష్టమైన సిద్ధాంత భూమికను అందించిన ఘనత మారోజు వీరన్న సూర్యాపేట సభదే. అయితే, ఆయన పెరుగుతున్న చైతన్యాన్ని తట్టుకోలేని సీమాంధ్ర పాలక వర్గాలు 1999 మే 16న మారోజు వీరన్నను బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమానుషంగా కాల్చిచంపాయి. ఆయన భౌతికంగా దూరమైనా, ఆ త్యాగ ఫలమే మలిదశ ఉద్యమానికి బలమైన పునాదిగా నిలిచింది.

**తెలంగాణ జనసభ ఆవిర్భావం:**

సూర్యాపేట, భువనగిరి సభల స్ఫూర్తితో 1998లో 'తెలంగాణ జనసభ' ఏర్పడింది. "దోపిడీ లేని తెలంగాణ" కావాలని, భౌగోళిక తెలంగాణతో పాటు సామాజిక తెలంగాణ సిద్ధించాలని ఈ వేదిక గట్టిగా నినదించింది.

**బి.ఎస్. రాములు అపూర్వ అక్షర ప్రతిజ్ఞ:** ఈ సామాజిక ఉద్యమాలకు తాత్వికమైన పునాది వేసిన వారిలో ప్రముఖ రచయిత, సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు అత్యంత ముఖ్యులు. వలస పాలనలో తెలంగాణ అస్తిత్వం ఎలా దెబ్బతిన్నదో వివరిస్తూ ఆయన ఒక చారిత్రాత్మకమైన ప్రతిజ్ఞ చేశారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడే దాకా ప్రతినెలా ఒక పుస్తకం తెస్తాను" అని ప్రకటించి, ఆయన అలుపెరగకుండా 42 అద్భుతమైన పుస్తకాలను ప్రచురించారు. ఈ 42 పుస్తకాలను ఆయన స్వయంగా, ఉచితంగా ప్రజలకు, ఉద్యమకారులకు పంపిణీ చేసి అక్షర చైతన్యాన్ని రగిలించారు. వలస పాలకుల సిద్ధాంతాలను తిప్పికొట్టడానికి ఈ పుస్తకాలు ఉద్యమకారులకు మేధోపరమైన ఆయుధాలుగా మారాయి.

**నందిని సిధారెడ్డి - తెలంగాణ రచయితల వేదిక:**

తెలంగాణ అస్తిత్వ సాహిత్యాన్ని ఒక తాటిపైకి తేవడానికి ప్రముఖ కవి నందిని సిధారెడ్డి గారి నేతృత్వంలో 'తెలంగాణ రచయితల వేదిక' (తెరలో) ఆవిర్భవించింది. "నాగేటి చాలల్లో నా తెలంగాణ..." అంటూ నందిని సిధారెడ్డి రాసిన పాట ప్రతి ఒక్కరి కళ్లల్లో నీళ్లు తెప్పించింది. ఈ వేదిక ద్వారా తెలంగాణ కవులు, రచయితలు వలసవాద సాహిత్యాన్ని చీల్చిచెండాడుతూ వందలాది కవితా సంకలనాలను ప్రజల్లోకి తెచ్చారు.

**జూలూరి గౌరీశంకర్ గారి సాహిత్య పోరాటం:**

సాహిత్య క్షేత్రంలో జూలూరి గౌరీశంకర్ గారి పాత్ర అత్యంత చైతన్యవంతమైనది. సీమాంధ్ర మీడియా, పాలకుల కుట్రలను తిప్పికొడుతూ ఆయన ఎప్పటి కప్పుడు పదునైన వ్యాసాలు,రాశారు. తెలంగాణ కవులందరినీ ఏకం చేస్తూ ఆయన తెచ్చిన సాహిత్య సంకలనాలు (ఉదాహరణకు 'పొక్కిలి' 'ముట్టడి' వంటివి) ఉద్యమ కాలంలో అక్షర సంచలనాలు సృష్టించాయి.

**3. ఉద్యమ రక్తసిక్తం: బెల్లి లలిత అమరత్వం, గద్దర్‌పై హత్యాయత్నం**

తెలంగాణ సాంస్కృతిక పోరాటం కేవలం చప్పట్లతో సాగలేదు. అణచివేతకు, పాలకుల క్రూరత్వానికి ఎంతో మంది కళాకారులు బలిపశువులయ్యారు.

**బెల్లి లలిత అమానుష హత్య (1999 మే):**

తెలంగాణ ఉద్యమ గొంతుక, 'తెలంగాణ కళాసమితి' కన్వీనర్ బెల్లి లలిత పాడితే పల్లె పరవశించేది. వలస పాలకుల గుండెల్లో వణుకు పుట్టించేలా భువనగిరి సభలో ఆమె పాడిన పాటలు ఉద్యమానికి ఊపిరి పోశాయి. అయితే, ఆమె చైతన్యాన్ని తట్టుకోలేని శక్తులు 1999 మే నెలలో (మారోజు వీరన్న హత్య జరిగిన కొన్ని రోజుల వ్యవధిలోనే) ఆమెను అత్యంత అమానుషంగా, క్రూరంగా 17 ముక్కలుగా నరికి చంపారు. ఆ వార్త తెలంగాణ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కానీ, బెల్లి లలిత చిందించిన రక్తం వృధా కాలేదు; ఆమె మరణం వందలాది మంది మహిళలను, కళాకారులను రోడ్లపైకి తెచ్చి ఉద్యమకారులుగా మార్చింది.

**ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై బుల్లెట్ల దాడి (1997 ఏప్రిల్ 6):**

తెలంగాణ తల్లి ఆర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన గద్దర్ గొంతును నొక్కేయడానికి 1997 ఏప్రిల్ 6న పాలకుల అండతో ఆయన నివాసంలోనే కాల్పులు జరిపారు. ఆరు తూటాలు (6 బుల్లెట్లు) ఆయన శరీరంలోకి దూసుకెళ్లాయి. తూటాను తన శరీరంలోనే మోస్తూ, చివరి శ్వాస వరకు తెలంగాణ ఆత్మగౌరవం కోసం గద్దర్ పాడారు. ఈ హత్యాయత్నం తెలంగాణ సమాజంలో పెను ఉప్పెనను సృష్టించింది.

**ధూం ధాంను నడిపించిన కళాకారుల సైన్యం :** ఈ వేదికలపై రసమయితో పాటు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చిన కళాకారుల బృందాలు, గాయనీగాయకులను ఒకసారి గుర్తు చేసుకోవాలి. అంతడుపుల నాగరాజు కళాకారుల బృందం తమ జానపద దరువులతో, నృత్యాలతో సభలను హోరెత్తించేవారు. ప్రజాకవి అందెశ్రీ తన గంభీరమైన గొంతుతో "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం..." అంటూ పాడుతుంటే సభలోని ప్రతి ఒక్కరూ లేచి నిలబడి వందనం చేసేవారు. ప్రజాకవి జయరాజు తన విప్లవాత్మక, జానపద గొంతుకతో "వానమ్మ వానమ్మ..." వంటి ఎన్నో అద్భుతమైన పాటల ద్వారా ప్రకృతిని, శ్రామిక బతుకును ఉద్యమంతో ముడిపెడుతూ జనాన్ని ఉర్రూతలూగించేవారు.

నేర్నాల కిశోర్ తన అద్భుతమైన ఆట పాటలతో, గాయని విజయ తన మధురమైన, ఆవేశపూరితమైన గొంతుకతో తెలంగాణ ఆవేదనను వినిపించేవారు. మాభూమి సంధ్య తన విప్లవాత్మక గొంతుతో, నటనతో ప్రజల్లో నిప్పులు చెరిగితే, వరంగల్ శ్రీను తనదైన శైలిలో పాటలతో పాలకుల దోపిడీని కళ్లకు కట్టారు. తెలంగాణ పల్లె బతుకును, పాలకుల విధ్వంసాన్ని వెంకన్న తన పాటల్లో అద్భుతంగా ఆవిష్కరించారు. "పల్లె కన్నీరు పెడుతుందో... కనిపించని కుట్రల..." అనే పాట గ్లోబలైజేషన్, ఆంధ్రా పాలకుల సృష్టించిన పల్లెల వినాశనాన్ని కళ్లకు కట్టింది. "అయ్యోనివా నువ్వు అవ్వోనివా... తెలంగాణోనికి నువు పాలేనివా..." అంటూ ఆంధ్రా వలస పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.

ఒకసారి గుర్తు చేసుకుంటే.. తెలంగాణ సాధనలో మారోజు వీరన్న, బెల్లి లలిత వంటి వారి ప్రాణ త్యాగాలు, గద్దర్ చిందించిన రక్తం ఎంత విలువైనవో... బి.ఎస్. రాములు గారి 42 పుస్తకాల అక్షర త్యాగం, నందిని సిధారెడ్డి గారి రచయితల వేదిక పోరాటం, జూలూరి గౌరీశంకర్ గారి అక్షర సంకలనాలు, రసమయి బాలకిషన్ మరియు అంతడుపుల నాగరాజు బృందం, అందెశ్రీ, జయరాజుల గొంతుకలు అంతే అమూల్యమైనవి. వీరంతా తమ జీవితాలను, కలాన్ని, గళాన్ని స్వరాష్ట్ర కాంక్ష కోసం ధారపోశారు. ఆనాడు వారు పాడిన పాటలే, ముద్రించిన అక్షరాలే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా తెలంగాణకు పునాదులు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ, ఆనాటి సాంస్కృతిక, సామాజిక, అక్షర యోధులను గౌరవంగా స్మరించుకోవడం మన కర్తవ్యం.



బిఎస్ రాములు
సామాజిక తత్వవేత్త
8331966988

# నికార్సైన తెలంగాణ ఉద్యమకారుడు కామ్రేడ్ మునీరన్న



**సామాజిక విప్లవకారుడు, ఉద్యమ వారధి, సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు కామ్రేడ్ మునీర్ డిసెంబర్ 14, 1959 న మహమ్మద్ గౌస్, హలీమా బేగం అనే పుణ్య దంపతులకు జన్మించారు. వీరిది పేద మధ్యతరగతి కుటుంబం. మునీరన్న బాల్యం మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో గడిసింది. కోల్ బెల్ట్ ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పెట్టుబడుదారుల దౌర్జన్యాలు చాలా తీవ్రంగా ఉండేవి. అప్పుడప్పుడే నవ యువకుడిగా పెరుగుతున్న మునీరన్న తన కళ్ళ ముందు జరుగుతున్న అన్యాయాలను చూసి చలించిపోయేవాడు. దానికి తోడు మునీరన్న వాళ్ళ అమ్మ హలీమా బేగం కూడా సామాజిక స్పృహ మెండుగా కలిగిన వ్యక్తి కనుక తన ప్రభావం కూడా మునీరన్నపై పడింది. అమ్మ అప్పుడప్పుడు మందమర్రిలో జరుగుతున్న దొరలు, గుండాల అరాచకాల గురించి మునీరన్న తో చర్చించేది. మందమర్రి ప్రాంతంలో భూస్వామ్య గుండాలు, సారా కాంట్రాక్టర్లు, వారి గుండాలు సామాన్య కార్మికులను భయభ్రాంతులకు గురి చేసేవారు. కార్మికులను హింసించడమే కాకుండా వారి జేబులో ఉన్న డబ్బులను దౌర్జన్యంగా లాక్కునేవారు.**

మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాలలో స్త్రీలపై కూడా చాలా తీవ్రమైన అరాచకాలు జరిగేవి, ఎవరైనా అమ్మాయి అందంగా కనిపిస్తే చాలు, బలవంతంగా ఎత్తుకెళ్లి రేప్ చేసి, చంపి బావిలో పడేసేవారు. దొరలకు కానీ వారి గుండాలకు కానీ ఎవరైనా ఎదురు చెబితే వారి పని అంతే తెల్లారే సరికల్లా వారి శవం రైలు పట్టాలపై ఉండేది. పోలీసులకు ఇట్టి విషయం తెలిసినా కూడా పట్టించుకునే వారు కాదు, అది రైలు ప్రమాదంగా చిత్రించి కేసు క్లోజ్ చేసేవారు.

అప్పుడప్పుడే విస్తరిస్తున్న సింగరేణి ప్రాంతంలో దోపిడీ, దౌర్జన్యాలు యదేచ్ఛగా సాగుతుండేవి. బొగ్గు బావుల్లో కూడా వెట్టి చాకిరీ చేయించుకునేవారు. అప్పటి పని పరిస్థితుల్లో కార్మికులకు ఎలాంటి రక్షణ ఉండేది కాదు, అనునిత్యం బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరుగుతుండేవి. చాలామంది చనిపోయేవారు, ఎంతోమంది అంగవైకల్యం చెందేవారు.

చిన్నప్పటినుండి దొరల, గుండాల దౌర్జన్యాలకు చూస్తూ పెరుగుతున్న మునీరన్న వాటిని చూసి తట్టుకోలేకపోయాడు. కార్మికులను, మిత్రులను చేరదీస్తూ కార్మిక ఉద్యమాన్ని నిర్మిస్తూ అప్పటి సారా కాంట్రాక్ట్ కి వ్యతిరేకంగా కార్మికులను సారా మానిపించడానికి సార మహమ్మారి నుంచి రక్షించడానికి సారా వ్యతిరేక ఉద్యమం చేపట్టారు.

ప్రకృతికి విరుద్ధంగా భూమి పొరల్లో నిత్యం మృత్యువుతో పోరాడుతూ, తమ రక్తాన్ని చెమటగా మార్చి బొగ్గు సంపద సృష్టిస్తూ దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులను చైతన్యం చేసే దిశగా తన కార్యాచరణ మొదలుపెట్టారు. సింగరేణి పాఠశాలలో కార్మికుల పిల్లలకు కాకుండా అధికారుల పిల్లలకు మాత్రమే సీట్లు కేటాయించేవారు, దానికి వ్యతిరేకంగా 11 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి కార్మికుల పిల్లలకు ముందుగా సీట్లు కేటాయించాలని అట్టి డిమాండ్ ను సాధించుకున్నారు.

అలాగే మొదలైన తన ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో కష్టాలను నష్టాలను చవిచూశారు. తను ఎప్పుడూ మనోధైర్యం కోల్పోకుండా ఉండడానికి తన తల్లి చెప్పిన విషయాలు గుర్తు చేసుకునేవారు "బిడ్డా... లోకంలో ఎప్పుడూ మంచి వాళ్ళకే కష్టాలు వస్తుంటాయి, కష్టాలు వస్తున్నాయని మంచిని వదులుకుంటే మనిషి బతికి ఉండి చచ్చినట్లే లెక్క" అని అమ్మ అనే మాటలు గుర్తుచేసుకొని ధైర్యం తెచ్చుకునేవారు. అలాగే "పంది అయ్యి పదేళ్ళు బతికే కంటే నంది అయ్యి నాలుగేళ్లు బతికినా చాలు" బిడ్డా... అని అమ్మ అనే మాటలు నిత్యం గుర్తు చేసుకుంటూ ఎంతో ధైర్యాన్ని కూడగట్టుకునేవారు.

సింగరేణి ప్రాంతంలో స్త్రీలపై జరుగుతున్న అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. మునీరన్న గొప్ప "స్త్రీవాది", స్త్రీలు అంటే ఎనలేని గౌరవం ఉండేది. దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, గుండాల దారుణాలకు వ్యతిరేకంగా సీఎస్పీలో లారీ లోడింగ్ కార్మికులపై గుండాల దోపిడి వ్యతిరేకంగా మునీరన్న చేపట్టిన పోరాటాల వల్ల దొరల గుండాలకు కొరకరాని కొయ్యగా తయారైనారు. మునీరన్న ను టార్గెట్ చేసి ఎన్నోసార్లు హత్యా యత్నం చేశారు. నిత్యం కసరత్తు చేస్తూ చాలా బలిష్టంగా, ఒక బాక్సర్‌గా తన ధైర్య సాహసాలతో వారి ప్రయత్నాలను ఎన్నోసార్లు విఫలం చేశారు.

దొరల దౌర్జన్యాలకు కేంద్రబిందువైన మందమర్రిలోని సినిమా టాకీసను 1979లో యువకులు కాలపెట్టారు, అట్టి కేసు మునీరన్నపై మోపి అరెస్ట్ చేసి తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసినారు. 1980లో ప్రజా కంటకుడు మందమర్రి భూస్వామిని హత్య గావించబడ్డాడు, అట్టి కేసును కూడా మునీరన్న పై మోపారు. మునీర్ బయట ఉంటే వారి ఆటలు సాగవని భూస్వాములు, గుండాలు తనకి జీవిత ఖైదు పడేలా చేశారు. మునీరన్న జైల్లో కూడా ఖైదీల హక్కుల కోసం తన పోరాటం కొనసాగించారు, అందుకు ప్రతిఫలంగా జైల్లో కూడా చాలా హింసను భరించాడు, గంజి సెల్లో ఉండి కూడా తన నిరసనను చేపట్టారు. జైళ్ళ ఐజి వచ్చి విచారణ జరిపి, తమ డిమాండ్స్ నెరవేర్చే వరకు తన పోరాటాన్ని కొనసాగించారు. మునీరన్న జైల్లో ఉండగా ఈ ప్రాంతంలో మహిళలు 300 వరకు రాఖీలు పోస్ట్ చేసి రాఖీ పండుగ రోజు తన రెండు చేతులు నిండేలా చేశారు. మందమర్రి భూస్వామి చనిపోయిన తర్వాత నరకాసురుడు చనిపోయాడు అని ప్రజలు సంబరపడ్డారు, అందరికంటే ఎక్కువగా సంతోషపడ్డవారు స్త్రీలు దానికి కృతజ్ఞతగానే మునీరన్నకు వందల సంఖ్యలో రాఖీలు పంపారు.

అటు తర్వాత పౌర హక్కుల సంఘం నాయకులు కన్నాబిరన్, సి. పద్మనాభ రెడ్డి గారు తమ కేసును హైకోర్టులో వాదించి కేసు కొట్టి వేయించారు. అటు తర్వాత మునీరన్న మళ్ళీ తన ప్రయాణాన్ని కొనసాగించారు. జైలు నుండి విడుదలైన తర్వాత తను మొట్టమొదటిసారి ఈ ప్రాంతానికి వస్తున్నారని తెలిసి చాలామంది వెళ్లి తనను చూసి అభినందనలు తెలుపడానికి వెళ్లారు, అప్పుడు విద్యార్థిగా ఉన్న నేను కూడా వెళ్లి మునీరన్నను చూసి రావడం జరిగింది. అప్పుడు ఒక ప్రజా కంటకున్నీ అంతమొందించిన కేసులో ప్రజల కోసం యావజ్జీవ కారాగార శిక్ష అనుభవించి బయటకు వచ్చిన మునీరన్న అంటే మాకు సహజంగానే



హీరోలాగా కనిపించేవారు.

**మునీరన్నతో నాకు పరిచయం :**

నాకు మునీరన్న కంటే ముందు తన తమ్ముడు సంధానితో పరిచయం ఉండేది. విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొనే నాకు అప్పుడు విద్యార్థి నాయకుడు ఐన సందాని (నాకు కాలేజీలో సీనియర్ కూడా) అన్న తో సాన్నిహిత్యం ఉండేది. సంధాని ఎమ్మెల్యేగా పోటీ చేస్తే విద్యార్థులుగా మేము తనని సపోర్ట్ చేశాము. అట్టి సమావేశానికి మునీరన్న కూడా హాజరైనారు. అప్పుడు మునీరన్నతో మొదటి పరిచయం అయింది కానీ మళ్ళీ చాలా రోజులు మేము ఎప్పుడు కలవలేదు, మళ్లీ తెలంగాణ ఉద్యమం కలిపింది మమ్మల్నిద్దరిని.

**సామాజిక విప్లవకారుడు మునీరన్న :**

ఒక సామాజిక బాధ్యత కలిగిన మునరన్న జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత విలేకరిగా కొత్త బాధ్యతలను నెత్తికెత్తుకున్నాడు. మొదట ఈనాడు, తర్వాత ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ లాంటి మొదలైన పత్రికలలో పనిచేయడమే కాకుండా ఒక విలేఖరిగా పత్రికా రంగంలో తనదైన ముద్రవేశారు. కార్మిక పోరాటాలను అణిచి వేసే క్రమంలో నిత్యం నిర్బంధం కొనసాగే సింగరేణి ప్రాంతంలో విలేకరులు అంటే మంచి గుర్తింపు, గౌరవం ఉండేది. మునీరన్న కూడా ఎవరికి భయపడకుండా కార్మికుల పోరాటాలను ఎత్తిపడుతూ ఎన్నో ప్రత్యేక కథనాలు రాసేవారు. బూటకపు ఎన్కౌంటర్ల గురించి, లాకప్ డెత్ గురించి, రాత్రికి రాత్రి పోలీసులు మాయం చేసే కార్యకర్తల గురించి శోధించి వార్తలు అందించేవారు. ఒక జర్నలిస్టుగా కార్మిక పక్షపాతిగా తన వార్తా కథనాలు ప్రజలను ఆకట్టుకునేవి.

కార్మికులు చేస్తున్న సమ్మెల సందర్భంలో న్యాయమైన డిమాండ్లను విశ్లేషిస్తూ సందర్భోచితంగా తను రాసిన వ్యాసాలు, వార్తలు కార్మికులలో నూతన ఉత్సాహాన్ని నింపేవి. అనేక సందర్భాల్లో తను రాసిన వార్తలు పోరాడే కార్మికుల్లో దిశానిర్దేశం చేసేవి. సంస్కరణల పేరుతో కార్మిక వర్గంపై జరుగుతున్న వ్యవస్థీకృతమైన దాడిని, దాని వికృత రూపాలను ఎప్పటికప్పుడు బట్టబయలు చేస్తూ మునీరన్న వ్రాసిన వార్తలు, విశ్లేషనలు కార్మికుల్లో నూతన చైతన్యాన్ని కలిగించేవి.

సింగరేణి విస్తరించే క్రమంలో భూనిర్వాసితులకు జరుగుతున్న అన్యాయాన్ని కథలు కథలుగా రాసి నిర్వాసితులకు బాసటగా నిలిచారు. సింగరేణి ప్రాంతంలో సంచలనం రేపిన "నేను రాజ పోసవ్వను మాట్లాడుతున్న" వంటి కథనాలు ప్రజల పట్ల తనకున్న ప్రేమను, అంకితభావాన్ని తెలిపేది. ఓపెన్ కాస్ట్ గనుల వల్ల ఈ ప్రాంత పర్యావరణంపై, ప్రజలపై పడుతున్న దుష్ప్రభావం పై తను చేసిన లోతైన పరిశీలనలు అనేక సందర్భాల్లో ఓపెన్ కాస్ట్ వ్యతిరేక పోరాటాలకు ఊతమిచ్చాయి. ఆదిలాబాద్ గిరిజనులు మట్టిని తిని బతికే దుర్భర జీవితాలను, ఆకలి చావులను, కనీస మానవ అవసరాలను తీర్చుకోలేని పేదరికాన్ని, వారిపై జరుగుతున్న దోపిడీ, అంచవేతలను, ప్రభుత్వ పథకాల డొల్లతనాన్ని వార్తలు, విశ్లేషనల రూపంలో కళ్లకు కట్టేవారు. తన కలాన్ని, గలాన్ని ప్రజలకు అంకితం చేసి వారు జరిపే ప్రతి పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచేవారు. "బండ కింద బతుకులు" శీర్షికన కార్మికులు అనుభవించే కష్టాలపై అనేక కథనాలను అందించారు.

ఇంతటి సాహసోపేతమైన వ్యక్తితో కలిసి పనిచేసే అదృష్టం నాకు తెలంగాణ ఉద్యమం కల్పించింది. సింగరేణి జేఏసీ చైర్మన్గా మునీరన్న సింగరేణి జేఏసి శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్‌గా నేను కలిసి పని చేశాం. స్వతహాగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనే నాపట్ల మునీరన్న కు ప్రత్యేక అభిమానం ఏర్పడింది. పేరుకే శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్ కానీ సింగరేణి మొత్తం మునీరన్నతో కలిసి తిరిగాను. తన ఉద్యమం అనుభవాలతో నాకు దిశా నిర్దేశం చేసేవారు.

**మిలియన్ మార్చ్ :**

మిలియన్ మార్చ్‌లో పాల్గొనడానికి నన్ను ఒక వాహనంలో పడుకోబెట్టుకుని అత్యవసరంగా హైదరాబాద్ హాస్పిటల్ కి తీసుకెళ్లాలి అని చెప్పి నిత్య నిర్బంధాన్ని దాటుకుంటూ మంచిర్యాల నుంచి హైదరాబాద్ వరకు 9 చెక్పోస్టులు, మూడు ముళ్లకంచెలు, ఐదు కిలోమీటర్ల కాలినడక, రెండు చోట్ల లాటీఛార్జి తట్టుకుని ఆ రోజు మేము మిలియన్ మార్చ్ లో ట్యాంక్ బండ్ ఎక్కినాము. ఆ రోజు ట్యాంక్ బండ్ ఎక్కిన మొదటి బ్యాచ్ మల్లేపల్లి లక్ష్మయ్య గారి నాయకత్వంలో ఐతే, రెండో బ్యాచ్ మాదే. అంతటి నిర్బంధంలో ట్యాంక్బండ్ ఎక్కడమంటే మేము ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత సంబర పడ్డాము. సాగరహారం, సకల జనభేరి, రైలు రోకో, రాస్తారోకో, సడక్ బంద్, ఇళ్ల ముందు దీక్షలు, రోడ్లపై వంటావార్పు మొదలైన పోరాటాల్లో మునీరన్న నాయకత్వంలో పాల్గొన్నాము.

**సకల జనుల సమ్మె :**

తెలంగాణ ఉద్యమం మొత్తం ఒక ఎత్తు అయితే సకలజనుల సమ్మె ఒక ఎత్తు అయింది. సకలజనుల సమ్మె మొదటి రోజు నుంచి చివరి వరకు ఎంతో సాహసోపేతమైన కార్యాచరణ తీసుకున్నాం. సకల జనుల సమ్మెలో సింగరేణి అధికారులు కలిసి రాకపోగా, పాలకుల ఒత్తిడి మేరకు దొంగ బొగ్గు రవాణాకు తెర లేపారు. ఉద్యమకారులు దొంగ బొగ్గు రవాణాను అడ్డుకోవడం కోసం మిలిటెన్సీ కార్య రూపాలను తీసుకోవడం జరిగింది. దొంగ బొగ్గు రవాణా చేసే లారీలను ధ్వంసం చేయడం, రైలు పట్టాలు పీకి వేయడం, బొగ్గు రవాణాకు కారణమైన అధికారుల వాహనాల ధ్వంసం అదేవిధంగా అధికారులు నివసించే బంగ్లా ఏరియాకు అగ్గి నీళ్లు (పాలు, నీళ్లు, పేపరు, విద్యుత్తు) బంద్ పెట్టడం జరిగింది. అదేవిధంగా ఓపెన్ కాస్ట్ ల ముట్టడి, ప్రతిరోజు ధర్నాలు, దిష్టి బొమ్మల దహనాలు, టూల్ డౌన్, పెన్ డౌన్ లాంటి కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకోలతో సింగరేణి ప్రాంతం అట్టుడికి పోయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై లాఠీ చార్జీ చేసినా, అక్రమ అరెస్టులు చేసినా, కేసీఆర్ నిరాహార దీక్ష చేపట్టినా సింగరేణిలో జేఏసీ పిలుపు మేరకు కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలకు దిగే వారు. సింగరేణి జేఏసీ తో పాటు సింగరేణి మహిళా జేఏసీ, సింగరేణి పాఠశాలల జేఏసీ, కుల సంఘాల జేఏసీ, విద్యార్థి జేఏసీ మొదలగు సంఘాల నిర్మాణం చేసి కార్మికుల పోరాటానికి మద్దతు కూడగట్టాం. అట్టి పోరాటంలో రెండు మూడుసార్లు నేను అరెస్టు కాకుండా నన్ను అక్కడి నుంచి మునీరన్న తప్పించారు. ఒక విలేకరిగా తనకున్న ముందస్తు సమాచారంతో నన్ను ఎప్పటికప్పుడు అలెర్ట్ చేసేవారు.

**ఉద్యమకారుల సంక్షేమం :**

అలాగే నేను ఒకసారి తీవ్రమైన అనారోగ్యానికి గురైతే స్వయంగా అప్పటి డైరెక్టర్ (పా) తో మాట్లాడి నన్ను ఆర్కేపి ఏరియా హాస్పిటల్ నుండి హైదరాబాద్ రెఫర్ చేయించి నాకు ఆపరేషన్ జరిపే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

కేవలం ఉద్యమం చేయడం మాత్రమే కాకుండా ఉద్యమకారుల యొక్క సంక్షేమం విషయంలో కూడా శ్రద్ధ వహించేవారు, బేసిగ్గా ఉద్యమకారులు అంటే మొత్తం ప్రజలలో ఉండి కుటుంబాలను పట్టించుకునేవారు కాదు, కానీ మునీరన్న మాత్రం అటు ఉద్యమాన్ని ఇటు కుటుంబాన్ని బ్యాలెన్స్ చేస్తూ వచ్చారు. ఒక పక్షి ఎగరాలి అంటే రెండు రెక్కలు ఎలాగో ఉద్యమకారునికి అటు ప్రజలు ఇటు కుటుంబం రెండు రెక్కలు లాంటివి అని చెబుతుండేవారు.

**సింగరేణి విజన్ డాక్యుమెంట్ :**

సింగరేణి జేఏసీగా ఉద్యమ సమయంలో కార్మికులకు జరిగిన నష్టాన్ని పూడ్చడానికి, ఈ ప్రాంత అభివృద్ధికి కావలసిన డిమాండ్స్ తో పొందు పరిచి "సింగరేణి విజన్ డాక్యుమెంట్" గా రూపొందించి అప్పటి ముఖ్యమంత్రికి ఇవ్వడం జరిగింది. అందులో ఒకటి మినహా అన్నిటిని ముఖ్యమంత్రితో మాట్లాడి కార్మికులకు ఇప్పించడం జరిగింది. మునీరన్న రాసిన వార్తలు, విశ్లేషణలు మాత్రమే కాదు, మునీరన్న రాసిన "తరతరాల పోరు" సింగరేణి కార్మికుల ఆరాట పోరాటాల పరిచయం, "అమ్మ తుజే సలాం" పుస్తకాలు ప్రజాదరణ పొందాయి.

కంచ ఐలయ్య రాసిన "నేను హిందువును ఎట్లయిత" అనే పుస్తకం చదువుతుంటే అందులో నా బాల్యం కనపడ్డట్టే, మునీరన్న రాసిన "అమ్మ తుజే సలాం" పుస్తకం చదువుతుంటే కూడా నేను విద్యార్థి దశలో చవిచూసిన ప్రతి అంశం నా కళ్ళ కట్టినట్టు కనిపించింది. మునీరన్నతో నాకు చాలా విషయాలలో భావ సారూప్యత ఉంది! మునీరన్న లేని లోటు అటు పత్రిక రంగానికి ఇటు కార్మిక ఉద్యమానికి, సామాజిక ఉద్యమాలకు పూడ్చలేనిది. ఆయన ఆశయం కోసం నిరంతరం పనిచేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం సందర్భాంగా మునిరన్న యాదిలో!









గోషిక మల్లేశం
కన్వీనర్ సింగరేణి జాక్
శ్రీరాంపూర్

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

మంగళవారం
02.06.2026

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచిన ఐవోసీ

19 కిలోల సిలిండర్‌పై రూ.42 పెంపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వాణిజ్య సిలిండర్ ధరని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మరోసారి పెంచింది. 19 కిలోల సిలిండర్‌పై రూ.42 ధరను పెంచుతున్నట్లు అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ పెంపు కోల్‌కతాలో రూ.53.50గా ఉంది. ఇక ఐదు కేజీల ఫ్రీట్రేడ్ ఎల్పీజీ సిలిండర్లపై

మిగతా 4లో..

## టెట్ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదల



9లో

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్



4లో

# ఆదివాసీల సొంతింటి కల సాకారం చేస్తాం

## నెలరోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా కొత్త సాంకేతికత

- రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా
- ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా
- కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎంకు లేఖ రాసినా స్పందన లేదు
- తెలంగాణ సీఎం అంటే ఎందుకంత చిన్నచూపు
- సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి
- వడ్లు కొనకపోతే జూన్ 15 తరువాత కేంద్రంపై యుద్ధమే
- కాగజ్‌నగర్ బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కాగజ్‌నగర్(జనంసాక్షి):** ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. 'తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరు శాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నా. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను

మిగతా 4లో..

## పంటమార్పిడిపై అవగాహన కల్పించండి

- వర్షాభావ పరిస్థితిని తట్టుకోగలగాలి
- నీటి వినియోగం తక్కువున్న పంటలపై రైతులకు వివరించాలి
- దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనలను పునరుద్ధరించాలి
- అత్యవసర పనుల కోసం రూ.వేయికోట్ల నిధులతో పనులు
- నదీజలాలపై రాజీ లేకుండా మనవాటా మనకు దక్కేలా చూడాలి
- అంతరాష్ట్ర జలాలను డ్యామ్‌ల వారీగా విడుదలకు చర్చించాలి
- వర్షాకాలంలోపు డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలి
- తాగు నీటికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు తలెత్తవద్దు...
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



4లో..





# కంప్యూటర్ బేస్డ్ విధానం వద్దు

## ఈసారి ఓఎంఆర్ పద్ధతిలోనే నిర్వహించాలి

- అకస్మాత్తుగా పరీక్షా విధానాన్ని మార్చడం ఆచరణాత్మకంగా కష్టం
- 'నీట్' రీటెస్ట్‌పై సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు
- పరీక్షల్లో సంస్కరణలపై జులైలో విచారణ జరుపుతామని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో నీట్ యూజీ రీటెస్ట్‌కు సంబంధించి సుప్రీం కోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సీబీటీ పద్ధతిలోనే పరీక్ష నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది. ఓఎంఆర్ పద్ధతిలోనే నిర్వహించాలని ఆదేశించింది. అకస్మాత్తుగా పరీక్షా విధానాన్ని మార్చడం ఆచరణాత్మకంగా కష్టమని న్యాయస్థానం పేర్కొంది. సమయాభావం, ఎన్టీఏపై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌క్రిప్టెడ్ క్వశ్చన్ పేపర్లు, ఏఐ నిఘాను పరిశీలించాలని పిటిషనర్ కోర్టును కోరారు. ఎన్టీఏ స్థానంలో కొత్త అథారిటీని ఏర్పాటు చేయాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. నీట్ పరీక్షల్లో సంస్కరణలపై జులైలో విచారణ జరుపుతామని వెల్లడించింది. జూన్ 21న దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను తిరిగి నిర్వహించనున్న విషయం తెలిసిందే.

## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జీలు

కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల

2లో..

## పరీక్షల్లో సీబీటీ విధానమే ఉత్తమం

- టీజీపీఎస్సీపై అసత్య ప్రచారాలు ఎప్పుడూ ఉండేవే..
- మాది చాలా క్లిష్టమైన ఉద్యోగం
- అందరినీ మెప్పించడం సాధ్యం కాదు
- జూన్‌లో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తాం
- ప్రభుత్వం నుంచి ప్రస్తుతం 3800 పోస్టుల భర్తీకి అనుమతులు
- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం



## రాయదుర్గం ఎకరా భూమి రూ.204 కోట్లు

ప్లాట్ నంబర్-4కు టీజీఐఐసీ వేలం నిర్వహించగా దక్కిన మొత్తం

రాయదుర్గంలో ఎకరా భూమి భారీ ధర పలికింది. టీజీఐఐసీ ఇక్కడి ప్లాట్ నంబర్-4కు వేలం నిర్వహించగా.. ఎకరా రూ.204 కోట్లు ధర పలికింది. ఈరోజు 5 ఎకరాలకు వేలం వేయగా.. రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం ఇచ్చింది. రెండు రోజుల క్రితం ఇక్కడ నిర్వహించిన వేలంలో ఎకరం రూ.237 కోట్లు ధర పలికింది. అప్పుడు రూ.1,490 కోట్లు ఆదాయం వచ్చింది. రెండు విడతల్లో కలిపి టీజీఐఐసీకి సుమారు రూ.2,500 కోట్ల ఆదాయం లభించింది.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలోని 23 ఐఐటీల్లో బీటెక్ కోర్సుల్లో చేరేందుకు మే 17న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు ఆదివారం అర్ధరాత్రి విడుదల అయ్యాయి. ఐఐటీ దిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్ ఈ పరీక్షల్లో టాపర్‌గా నిలిచారు. మొత్తం 56,880 మంది విద్యార్థులు

మిగతా 4లో..



## ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

- రైతులను ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు

మిగతా 9లో..

# తడిసిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర

- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు
- త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలి

## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం:మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
రైతులు పండించిన ధాన్యాన్ని గింజ లేకుండా పూర్తిస్థాయిలో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల,భారీ నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి పరిశీలించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తూ మద్దతు ధరకు కొనుగోళు చేపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 354 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జిల్లాలో 71 రైస్ మిల్లులను కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేయగా, మరో 22 మిల్లులను అదనంగా ధాన్యం సేకరణకు సిద్ధం చేసినట్లు వివరించారు.బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కూలీల కొరత ఏర్పడటంతో ధాన్యం ఎగుమతులు, దిగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. లారీల కొరతను అధిగమించేందుకు పోలీసు శాఖ సహకారంతో ఇసుక, సిమెంటు ఇతర అవసరాలకు వినియోగిస్తున్న లారీలను ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది కలుగకుండా రవాణాకు మళ్లించినట్లు పేర్కొన్నారు.

మిగతా 4లో..

# హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?

- తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్
- బీజేపీ ప్రోద్బలంతోనే పవన్ కొత్త నాటకం
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్




**సిద్దిపేట(జనంసాక్షి):**ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు

మిగతా 4లో..

## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

4లో

# మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లిన పశ్చిమాసియా





## ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్ రాజీనామా..?

4లో

- భగ్గుమన్న హర్మూజ్
- అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు
- కువైట్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌పై దాడి

**టెహ్రాన్(జనంసాక్షి):**శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్‌లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది.సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని

మిగతా 4లో..



# పిక్‌పాకెటర్స్ ఉన్నారు జాగ్రత్త!

## సీబీఎస్ఈ కార్యాలయంలో తిష్టవేశారు

విద్యార్థులతో రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సీబీఎస్ఈ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై కేంద్రం, సీబీఎస్ఈని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి టార్గెట్ చేశారు. మూల్యాంకన ప్రక్రియలో చేసిన తప్పుల నుంచి సీబీఎస్ఈ లాభపడుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన విద్యార్థులతో ముచ్చటించిన వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా షేర్ చేశారు.' 'జేబుదొంగలు ఉన్నారు జాగ్రత్త. వారు సీబీఎస్ఈ కార్యాలయంలో తిష్ట వేశారు. సీబీఎస్ఈ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే.. దానికి మీకు బిల్లు పడుతుంది. అదెలాగంటే..డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్ట్‌కు రూ.100.ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ.100 రి-ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ.25మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబుపత్రాన్ని సరిగా దిద్దించుకోవడానికి దాదాపు రూ.2000 చెల్లించాల్సి రావొచ్చు. 4 లక్షల మంది విద్యార్థులు దీనికోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు.. అబాఇ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలి. ఫోన్‌తో స్కాన్ చేస్తే.. తప్పులు రావడం ఖాయం. వాటిని సరిచేయడానికి అయ్యే ఖర్చు విద్యార్థులే చెల్లించాలి. తప్పు సీబీఎస్ఈది.. శిక్ష పడుతున్నది విద్యార్థులకు.. ఆదాయమేమో ప్రభుత్వానికి..! విద్య ఒక వ్యాపారంగా మారితే.. తప్పులు సరికాకపోగా రెట్టింపు అవుతాయి. సమయం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు రూపంలో విద్యార్థులు మూల్యం చెల్లించుకుంటున్నారు" అని రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. సీబీఎస్ఈ టెండర్ నిబంధనలను

మిగతా 4లో..

# మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లిన పశ్చిమాసియా

ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫైటర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి.

హర్మూజ్‌లో ఖేష్మ్ చాలా కీలకం

హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్ క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఘద్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

# ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్ రాజీనామా..?

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ ఐఆర్‌జీసీ దళాల తీరుపై అసంతృప్తితో అధ్యక్షుడు మసూద్ పెజష్కియన్ రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఆయన తన రాజీనామా లేఖను సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి పంపినట్లు అమెరికా కేంద్రంగా నడిచే ఇరాన్ పత్రిక వెల్లడించింది. ఇరాన్ పాలన ఐఆర్‌జీసీ కమాండర్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నట్లు ఆయన తన రాజీనామా లేఖలో హెచ్చరించినట్లు వెల్లడించింది. యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి కీలక నిర్ణయాల విషయంలో ఇరాన్ ప్రభుత్వ అధికారులను దూరంగా ఉంచుతున్నట్లు ఆరోపించారు. పెజష్కియాన్ రాజీనామా లేఖపై సుప్రీం లీడర్ ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టినట్లు వెల్లడించింది. పాలన, చట్టపరంగా తనకు ఉన్న బాధ్యతలను కూడా పూర్తి చేయనీయకుండా చేస్తున్నారని పెజష్కియాన్ ఆరోపించినట్లు వెల్లడించింది. మరోవైపు ఈ కథనంపై ఇరాన్ అధ్యక్ష కార్యాలయంలోని కమ్యూనికేషన్స్ విభాగం డిప్యూటీ హెడ్ మెహదీ తబాతబాయి స్పందించారు. ప్రస్తుతం అమెరికాతో చర్చల వేళ తప్పుడు రిపోర్టులతో మీడియా గేమ్స్ ఆడుతోందని ఆరోపించారు. తుర్కియే ప్రభుత్వ పత్రిక కూడా ఈ ఖండనను సమర్థించింది.

శాంతి ఒప్పంద ప్రతిపాదనలు వెనక్కి పంపిన ట్రంప్

ఇరాన్‌తో శాంతి ఒప్పంద ప్రతిపాదనల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్పులు కోరారు. తాజా డ్రాఫ్ట్‌లో 60రోజుల కాల్పుల విరమణ, హర్మూజ్ తెరిచేందుకు చర్యలు వంటివి ఉన్నాయి. అయితే ట్రంప్ మాత్రం ఇరాన్ అణ్వాయుధాలు తయారీని పూర్తిగా వదిలేయాలనే అంశంపై పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దీంతో పాటు హర్మూజ్‌పై కూడా కొన్ని మార్పులు కోరినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. ఈ క్రమంలో డీల్ చేసుకోవడానికి తాము తొందరపడమని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ ఒప్పంద ప్రతిపాదనలపై స్పందిస్తూ.. ఇరాన్ హక్కులను కాపాడని ఏ డీల్‌కు తాము అంగీకరించబోమని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?

అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబా ద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# ఆదివాసీల సొంతింటి కల సాకారం చేస్తాం

పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకంత చిన్నచూపు? సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం.

**వడ్లు కొనకపోతే కేంద్రంపై యుద్ధమే:**



రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం"అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# పంటమార్పిడిపై అవగాహన కల్పించండి

హైదరాబాద్,జూన్1(జనంసాక్షి):ఎల్‌నినోప్రభావంతో వర్షాభావపరిస్థితులునెలకొంటాయనివాతావారణ శాఖ నివేదిస్తున్నందున కృష్ణా, గోదావరిజలాల్లోమన వాటా జలాలు దక్కేలాచూడాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్‌లు నిండిన తర్వాతే నీళ్లు వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా ఉన్నందున అంతరాష్ట్రజలాల్లో ప్రొరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సిన వాటా జలాలు వచ్చేలా ఆయా రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల వర్షాకాల సన్నద్ధతపై సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి సోమవారం సమీక్షనిర్వహించారు. మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జలవిద్యుదత్పత్తికే మహారాష్ట్రవినియోగిస్తోందని... ఆ మొత్తం నీటిని మనం తీసుకొని వారికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసే దానిపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని సీస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. గోదావరినది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయని... అయితే ఆ వరదంతా చాలా స్వల్ప కాలంలోనే వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన సీలేరు, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో తెలంగాణకు రావాల్సిన వాటాపై నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీఎం ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. గతంలోకడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను సీఎం గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లకు సంబంధించి ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు ముఖ్యమంత్రికితెలియజేశారు. ఎన్ని నిధులు అవసరమైనా వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల నుంచి అవగాహనకల్పించాలని సీఎం సూచించారు. ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని సీఎం తెలిపారు. టీవీ ఛానెళ్లలోనూ ఇందుకు సంబంధించిన ప్రసారాలు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పంటలసాగుతో పాటు అవసరమైనవిత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తాను క్షేత్ర స్థాయిలో పర్యటించినసమయంలో ఇచ్చిన హామీల అమలుపై అధికారులనుముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నాడు ఇచ్చిన హామీలు.. వాటి ప్రస్తుతపరిస్థితి.. ఏవైనా నెరవేరకుంటే అందుకు కారణాలతో తనకు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. హామీల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల సమయంలో విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం సూచించారు. వడగాలులు, వరదల సమయంలోప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడువెంటనే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వరదలసమయంలోదెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతనవంతెనల

# సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జీలు

## కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్ , జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత దిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరున్‌జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది.

# భాజపాకు తెలంగాణలో అధికారం కల్ల

## సీపీఐ కూనంనేని జోస్యం

## మతం పేరుతో రాజకీయాలు తగవని హితవు

హైదరాబాద్(జనంసాక్షి):మతపరమైన విభజన పైన.. మతం అనే సౌధంపైన భాజపా నిలబడి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ముగ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. భాజపా తెలంగాణాలో దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందని ఆ పార్టీ నేతలు ఊదరగొడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో భాజపా కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజల అసంతృప్తిని చూస్తున్నాం. అందుకే, సీపీఐ శ్రేణులు పోరాటాలు చేయాలి. సమస్య ఎక్కడ ఉంటే.. అక్కడ మనం ఉండాల్సిందే. వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉంటే కనీసం ఐదు స్థానాల్లో, లేకుంటే కనీసం 15 స్థానాల్లో పోటీ చేసేలా సన్నద్ధం కావాలి. ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు వేధింపులపై 4న, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్‌ఐఆర్)పై జూన్ 15న ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. ఆగస్టు 6 నుంచి 15 వరకు పాదయాత్రలు చేపట్టాలి. రాష్ట్రంలో బలమైన 40 నియోజకవర్గాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో పాదయాత్రలు చేపట్టాలి. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, కేంద్ర.. రాష్ట్ర వైఫల్యాలు ఆయా ప్రాంతాల్లో ఉన్న స్థానిక సమస్యలను పాదయాత్రల్లో ప్రస్తావించాలన్నారు.

# రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు, మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాలకు ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ స్థానాలతో పాటు పదవీకాలం ముగియకుండానే ఖాళీయైన మూడుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ నెల 8వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. బిహార్‌లోని తొమ్మిది రాష్ట్ర శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరగనుండగా ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఇదీ చదవండి: ఔఇఖ రీ-ఎగ్జామ్‌పై సుప్రీం కీలక ఉత్తర్వులు

# వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచిన ఐవోసీ

రూ. 11 చొప్పున పెంచారు. గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మార్పులు లేవు. మన దేశంలో సాధారణంగా ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం రిటైల్ ధరలను ఏకకాలంలో నిర్ణయిస్తాయి. ఇతర సంస్థల గ్యాస్ ధరల్లో కూడా మార్పులు ఉండే అవకాశం ఉంది.ఇరాన్-అమెరికా మధ్య యుద్ధంతో హర్మూజ్ వద్ద నౌకల రవాణా నిలిచిపోవడం భారత్ ఎల్పీజీ ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారత్‌కు అవసరమైన గ్యాస్‌లో చాలా పెద్ద మొత్తం ఈ మార్గంలోనే ఖతార్, సౌదీ, యూఏఈల నుంచి వస్తుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఇటీవలే ప్రభుత్వ రంగ ఇంధన కంపెనీలు వాణిజ్య గ్యాస్ స్టాక్ కాకుండా కనీసం 30 రోజులకు సరిపడా నిల్వలు చేయాలని సూచించింది. దిగుమతుల్లో సమస్యలను అధిగమించేందుకు ఈ చర్యను చేపట్టింది.

# హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

హైదరాబాద్(జనంసాక్షి): రాయదుర్గంలోని సంధ్య కన్వెన్షన్ వేదికగా జూన్ 2న ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం' సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు, శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. దీనిపై శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తల్లూరి రామ్ జూన్ 2న సంధ్య కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుమారు 2 వేల మంది కార్యకర్తలతో నిర్వహించాలనుకున్న జనసేన సాధకుల సమావేశానికి అనుమతి కోరినట్లు చెప్పారు. "సమావేశం అనుమతి విషయంపై దర్యాప్తు చేశాం. ఏపీలో ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ వ్యాఖ్యలపై నమోదైన కేసులు, వాటి కారణంగా తెలంగాణలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, అలాగే కొందరు ఏపీ రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని దర్యాప్తులో తేలింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, వ్యతిరేక ఆందోళనలు జరిగే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సమయంలో ఈ సమావేశం వల్ల భారీ స్థాయిలో నిరసనలు, ప్రదర్శనలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడొచ్చు. ఈ పరిస్థితుల్లో సమావేశం నిర్వహిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మరోవైపు, సమావేశానికి వచ్చే సుమారు 2 వేల మంది కోసం సరిపడా పార్కింగ్ సదుపాయం లేదని వేదిక యాజమాన్యం ధ్రువీకరించింది. ఈ పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జనసేన సమావేశానికి అనుమతి నిరాకరించాం"అని డీసీపీ తెలిపారు.

కోర్టును ఆశ్రయించిన జనసేన నేతలు

జనసేన సమావేశానికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆ పార్టీ నేతలు కోర్టును ఆశ్రయించారు. దీనిపై జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్య కర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు.

# తడిసిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర

గత ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పంట సీజన్‌లో అత్యధిక స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత రాష్ట్రానికి దక్కిందన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు చేశామని చెప్పారు. రైతుల ఖాతాల్లో కొనుగోలు చేసిన 48 నుండి 72 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు.భారతదేశంలో యాసంగి వరి ధాన్యంలో 63 శాతం తెలంగాణ నుంచే సరఫరా అవుతుందని, వరి ఉత్పత్తి, కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని జూన్ 4 నాటికి పూర్తిగా తరలించి కొనుగోలు ప్రక్రియను ముగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, ఎస్పీ కె.నరసింహ, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డీఎస్ఓ మోహన్ బాబు, ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీవో లాజర్, ఏపీఎం లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వై.చామంతి,నరేష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల్లో సీబీటీ విధానమే ఉత్తమం



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని నిరుద్యోగ నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం ఒక పెద్ద శుభవార్త చెప్పారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో వేగం పెంచడంతో పాటు, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సరికొత్త మార్పులు తీసుకువస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించేలా పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు.తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అన్నారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయని చైర్మన్ తెలిపారు. అటవీ శాఖలో 3,093 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సింగిల్ పోస్ట్ ఖాళీలు 25 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇకపై క్రమంతప్పకుండా రెగ్యులర్ గా నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెల సగటున మూడు నోటిఫికేషన్లు ఇస్తామని, రేపే మూడు కొత్త నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఉద్యోగ నియామక ప్రక్రియ ఏది ప్రారంభించినా, దానిని గరిష్టంగా ఒక ఏడాది లోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అలాగే.. ఇకపైనిర్వహించే నియామక పరీక్షలన్నీ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ మోడ్ లోనే జరుగుతాయని తెలిపారు. దీనివల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని, పరీక్ష పేపర్‌ను ముందే తయారు చేయడం అనేది ఇకపై ఉండదని చెప్పారు. వీలైతే అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసిపోయేలా సాంకేతికతను తీసుకువస్తున్నట్లు హింట్ ఇచ్చారు. ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్, తర్వాత పరీక్ష, ఆపై మెరిట్ లిస్ట్, చివరిగా సెలక్షన్ లిస్ట్ అనే పారదర్శక విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తామన్నారు. పరీక్షల్లో ఎలాంటి లోపాలు లేవనే నమ్మకాన్ని అభ్యర్థుల్లో కలిగించడానికే తామంతా పనిచేస్తున్నామని చెప్పారు.ఇదే సమయంలో ఆయన ఒక ప్రాధాన్యత గల విషయాన్ని గుర్తుచేశారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదని, కేవలం 0.1 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఉద్యోగం రాని మిగతా వాళ్ళు కమిషన్‌పై దుష్ప్రచారం చేయడం సహజమేనని, అయితే అభ్యర్థులు అలాంటి వదంతులను నమ్మవద్దని ఆయన కోరారు. మొత్తానికి ఃఉఖాఅ తీసుకొస్తున్న ఈ మార్పులు నిరుద్యోగుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. ఇకపోతే మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం. అందుకే, ఇకపై 2, 3 నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తాం. పరీక్షల విషయానికొస్తే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణెళి ఉత్తమమైంది. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైంది. పరీక్షల నిర్వహణలో అనేక సంస్కరణలు తెస్తున్నాం. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నాం. ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తాం. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయి. జూన్ 2న మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. 3,800 పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చింది. 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని బుర్రా వెంకటేశం తెలిపారు.

సీబీటీ విధానమే ఉత్తమమైనది

తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అన్నారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు."మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం. అందుకే, ఇకపై 2, 3 నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తాం. పరీక్షల విషయానికొస్తే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైంది. పరీక్షల నిర్వహణలో అనేక సంస్కరణలు తెస్తున్నాం. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నాం. ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తాం. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయి. జూన్ 2న మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. 3,800 పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చింది. 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి" అని బుర్రా వెంకటేశం తెలిపారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు విడుదల


ఉత్తీర్ణత సాధించారు. విశాఖ నారాయణ కాలేజీ విద్యార్థి సందీప్‌కు 5వ ర్యాంక్ వచ్చింది. వాస్తవానికి ఈ ఫలితాలను జూన్ 1వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని ప్రకటించారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. జూన్ 2వ తేదీ నుంచి ఐఐటీలతోపాటు ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా), కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లో సీట్ల భర్తీకి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా సుమారు 1.90 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారని అంచనా. ఈ పరీక్షలో కనీస మార్కులు సాధించినవారు మాత్రమే ఐఐటీల్లో సీట్లకు పోటీ పడాల్సి ఉంటుంది.

# పిక్‌పాకెటర్స్ ఉన్నారు జాగ్రత్త!

మార్చేసిన ఫలితమే ఇదీ అని రాహుల్ ఇప్పటికే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి 300 డీపీఐతో ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లను పరీక్ష పత్రాల స్కానింగ్‌కు వినియోగించాల్సి ఉండగా.. ఆన్సర్ షీట్లను మొబైల్ ఫోన్ సాయంతో స్కాన్ చేసి తప్పిదాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు బాధితులుగా మారారని ఆందోళన వ్యక్తంచేశారు. పరీక్షల నిర్వహణలో యంత్రాంగం వైఫల్యం.. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలవరపరుస్తోంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన మరవకముందే... కొద్ది రోజులుగా సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

# ఏఐసిసి అధ్యక్షులు ఖర్గేతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

**జార్ఖండ్ రాజకీయ పరిణామాలపై ఏఐసీసీ అధినేతకు నివేదిక**



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈరోజు ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మర్యాదపూర్వకంగా సమావేశమ య్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇటీవల జార్ఖండ్ పర్యటనకు వెళ్లిన భట్టి విక్రమార్క.. అక్కడ తాను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలను ఈ సందర్భంగా ఖర్గేకు నివేదించారు. జార్ఖండ్‌లో త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో తాను జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏఐసీసీ అధినేతకు వివరించారు. రాజ్యసభ ఎన్నికల్లో 'ఇండియా' (ఇండియా) కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగడంపై జార్ఖండ్ స్థానిక నాయకత్వంతో జరిపిన సంప్రదింపులను భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమి ఐక్యతను చాటేలా జార్ఖండ్ కాంగ్రెస్ నేతలు శ్రమిస్తున్న తీరును ఆయన ఏఐసీసీ అధ్యక్షునికి వివరించారు.

# ఇనుప కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుద్ఘాతం

- తండ్రీ కొడుకులు మృతి



**పెంబి, జూన్ 01 (జనం సాక్షి) :** ఇనుప కూలర్‌లో నీళ్లు పోస్తుండగా విద్యుద్ఘాతానికి గురై తండ్రీ కొడుకులు మృతి చెందిన సంఘటన పెంబి మండలంలోని కోరకంటి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోరకంటి తండాకు చెందిన రాథోడ్ అర్జున్, అతని కొడుకు రాథోడ్ శ్రీనివాస్‌తో కలిసి ఇంట్లో ఉన్న ఇనుప కూలర్‌లో నీళ్లు పోస్తుండగా, కూలర్ వైరు ఆన్ చేసి ఉండగా అకస్మాత్తుగా ఇద్దరికీ విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. విద్యుత్ షాక్ తగిలి పడి ఉన్న వారిద్దరిని రక్షించడానికి వెళ్లిన రాథోడ్ అర్జున్ భార్య సోనూభాయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఖానాపూర్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్రమాద విషయం తెలుసుకున్న పెంబి ఎస్సై హనుమాన్లు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ముస్లింల సమస్యల పరిష్కారానికి బీసీ కమిషన్ హామీ

**బీసీ-ఈ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణల అంశంపై యాకూబ్ పాషా వినతి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ముస్లింలకు సంబంధించిన బీసీ–ఈ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో రాష్ట్రంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా బీసీ కమిషన్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బీసీ–ఈ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్య, ఉపాధి అవకాశాలను పొందేందుకు అర్హులైన ముస్లింలకు ఈడబ్లూఎస్ సర్టిఫికెట్లు పొందేందుకు సరైన మార్గదర్శకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా విద్యాశాఖ రూపొందించిన ఐయస్ఎంఎస్ పోర్టల్‌లో ముస్లిం విద్యార్థుల వివరాలలో మహమ్మద్ ఇంటి పేరు గల విధ్యార్థుల నమోదుకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావించి భవిష్యత్తులో ముస్లిం రిజర్వేషన్ల ప్రయోజనాలు అందరికీ సమానంగా చేరేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయాలపై స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు యాకూబ్ పాషా తెలిపారు. దీంతో ముస్లిం వర్గాల్లో సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషన్ సభ్యులు రాప్రోలు జై ప్రకాష్, తిరుమలగిరి సురేందర్, మైనారిటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ వహాబ్ ఉద్దీన్ పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

- నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ

**హైదరాబాద్, జూన్1 (జనంసాక్షి) :** జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# బార్‌లో యువకుల మధ్య గొడవ

- యువతని కారుతో ఢీకొని చంపిన దుండగులు

**చెన్నై, జూన్1 (జనంసాక్షి) :** ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ది చెప్పి బయటకు పంపించారు. బార్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు.

# చిన్నారులను తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీలది కీలక పాత్ర

- రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు
- గోలేటిలో 'అమ్మ మాట అంగన్వాడి బాట'



**రెబ్బెన, జూన్ 1 (జనంసాక్షి) :** చిన్నారులను తీర్చిద్దిడంలో అంగన్‌వాడీలది కీలక పాత్ర వహిస్తున్నాయని రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం-4లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా విచ్చేసిన రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావులు 'అమ్మ మాట - అంగన్వాడి బాట' కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేసవి సెలవుల అనంతరం అంగన్వాడి కేంద్రాలు పునఃప్రారంభమైన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులను సంపూర్ణ నైపుణ్యాలతో తీర్చిదిద్దడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నిరుపేద కుటుంబాలు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాల్లోనే పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రస్తుతం అంగన్వాడి కేంద్రాలను ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సౌకర్యాలతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని, పిల్లలకు 'అమ్మ ముద్ద' పేరుతో అల్పాహారం అందించే పైలట్ ప్రాజెక్టుకు ఆదిలాబాద్ జిల్లాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న ఖాళీలను త్వరలో భర్తీ చేసి, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి వేతనాల పెంపు దిశగా కూడా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు పిల్లలే నిజమైన ఆస్తి అని అన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలను ప్లే స్కూళ్లు, అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి మంచి అలవాట్లు నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇక జిల్లాలోని రెండు నియోజకవర్గాల గిరిజన కుటుంబాలకు చెందిన సుమారు వెయ్యి మందికి హైదరాబాద్ నగరాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఎన్నడూ హైదరాబాద్ చూడని గిరిజనులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసి చిన్నారులను ఆశీర్వదించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడి సిబ్బంది, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా జిల్లా కలెక్టర్ కె హరిత అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో, అంగన్వాడి టీచర్స్ తో మాట్లాడారు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, గోలేటి సర్పంచ్ అజ్మీరా బాబురావు, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జి శ్యాం నాయక్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ కాంబ్లే అనిల్, మార్కెట్ కమిటీ ఇరుకుల్ల మంగ, తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను స్వాగతిస్తున్నాం!

- ప్రాథమిక వేతనంపై 1.5% కోత విధించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలి
- ఉద్యోగి వాటాను బేసిక్ పేతో కాకుండా కుటుంబ సభ్యుల ఆధారంగా నిర్ణయించాలి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ పథకం పారదర్శకంగా, సమానంగా, ఆర్థికంగా నిలకడగా, ఉద్యోగి-స్నేహ పూర్వకంగా ఉండేందుకు తోడ్పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్) తరహాలో ఈహెచ్ఎస్‌ను సైతం పునర్వ్యవస్థీకరించాలన్నారు. పథకానికి సంబంధించిన వివరాలపై పూర్తి అవగాహన కల్పించిన తర్వాతనే ఉద్యోగుల సమ్మతి తీసుకుని హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. ప్రాథమిక వేతనంపై 1.5% కోత విధించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన 15 ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఉద్యోగుల ఆరోగ్య పథకం ఎలా ఉంటే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు సౌకర్యంగా, అందుబాటులో ఉంటుందో పలు ప్రతిపాదనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చాడు.



## హుస్నాబాద్ మున్సిపాలిటీకి ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారం

- మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హుస్నాబాద్ మున్సిపాలిటీకి 2026 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అందజేస్తున్న "ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారం" హుస్నాబాద్‌ను వరించింది. హుస్నాబాద్, సూర్యాపేట మున్సిపాలిటీలు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. పురస్కార ప్రదానోత్సవం 2026 జూన్ 05న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, సనత్ నగర్, హైదరాబాద్ లో అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, కమిషనర్, సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులు, హుస్నాబాద్ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా హుస్నాబాద్‌ను పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ఆదర్శ మున్సిపాలిటీగా నిలిపేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# నేరాల అదుపులో పోలీసుల కృషి అభినందనీయం

- రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్‌నగర్ జూన్ 01 (జనంసాక్షి):** ప్రజలకు భద్రత కల్పించడంలో, నేరాలను అదుపు చేయడంలో పోలీసుల కృషి అభినందనీయమని రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్ నగర్ సర్కిల్ పోలీస్, ప్రజలకు రక్షణ, కల్పించడం, నేరాలను నిరోధించడంలో భాగంగా సర్కిల్ పరిధిలో ఉన్న హుజూర్నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి మండలాల పరిధిలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు 50 లక్షల రూపాయలతో 372 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలు హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేశారు. వీటిని ఏర్పాటు చేయడంలో జిల్లా ఎస్పీ నరసింహ ప్రత్యేక పర్యవేక్షణలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చరమందరాజు, ఐదు మండలాల ఎస్ఐలు అనుక్షణం పనిచేసి సీసీ కెమెరాలు ఏర్పాటులో కృషి చేశారు. 50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 372 సీసీ కెమెరాల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను సోమవారం సర్కిల్ పోలీస్ స్టేషన్ నందు జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ నర్సింహ ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు భద్రత కల్పించడం, రక్షణ కల్పించడంలో భాగంగా పోలీస్ శాఖ తీసుకున్న ప్రత్యేక కార్యాచరణను ముందుగా అభినందిస్తున్నాను. జిల్లా ప్రజలకు మెరుగైన భద్రతను కల్పిస్తూ నేరాలు నిరోధించడంలో భాగంగా జిల్లా పోలీస్ చేస్తున్న కృషి అభినందనీయం, అలాగే నియోజకవర్గ పరిధిలో ఐదు పోలీస్ స్టేషన్ ల పరిధిలో అత్యాధునికమైన సాంకేతికతతో కూడిన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ప్రారంభానికి నన్ను భాగస్వామ్యం చేయడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో నేరాలు నిరోధించడంలో, తప్పు చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఎస్పీని ఆదేశించారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పారదర్శకమైన సేవలు అందించడం లక్ష్యంగా హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న హుజూర్ నగర్, మఠంపల్లి, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు పోలీస్ స్టేషన్ ల పరిధిలో 50 లక్షల వ్యయంతో 372 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆత్మహత్య

- అదనపు కట్నం వేధింపులే అంటున్న కుటుంబ సభ్యులు

**లక్నో, జూన్1 (జనంసాక్షి) :** పెళ్ళైన రెండేళ్లకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లఖ్‌నవూకు చెందిన సాగర్ రాజ్‌పుత్‌కు 2024లో కాన్పూర్‌కు చెందిన మాన్షితో పెళ్లయింది. మాన్షి తల్లిదండ్రులు వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం బాగానే సాగింది. ఇద్దరూ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లుగా స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాగర్‌కు ఇన్‌స్టాలో 8 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి వీడియోలు చేసే వారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, మాన్షి అత్తింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మరణంపై మాన్షి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదనపు కట్నం కోసం తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. 'పెళ్లి సమయంలో వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చాం. అయినా వాళ్లకు సంతృప్తి కలగలేదు. అదనపు కట్నం కోసం నా కూతురిని హింసిస్తున్నారు. కారు కావాలని అడుగుతున్నారు. తక్కువ కట్నం తెచ్చిందని అంటూ మాన్షిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు'.. వేధింపుల గురించి మాతో చెప్పుకుని మాన్షి చాలా ఏడ్చేది. మాన్షి అత్తింటి వారికి సర్ది చెప్పటం కోసం పలుమార్లు లఖ్‌నవూ వెళ్లి వచ్చాము. మా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని శనివారం ఫోన్ కాల్ వచ్చింది. మా కూతురిది ముమ్మాటికీ హత్యే. మాన్షిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు' అని అన్నారు. పోలీసులు సాగర్‌తో పాటు మరో ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మారేడుపల్లిలో యువకుడి దారుణ హత్య

**హైదరాబాద్, జూన్1 (జనం సాక్షి) :** సికిం ద్రాబాద్ పరిధి మారే డుపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో దా రుణ హత్య జరిగింది. శ్రావణ్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన మద్యం మత్తులో జరిగిన ఘర్షణగా పోలీసులు చెప్పారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణ్ తన స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి మద్యం తాగాడు. అయితే నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ విషయంలో వారు ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న మరో యువకుడు కత్తితో శ్రావణ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రావణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు

# కుటుంబంలో చిచ్చు పెట్టిన ఫోన్ ట్యాపింగ్

- బిఆర్ఎస్ నిర్వాకంపై మండిపడ్డ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్, జూన్1 (జనంసాక్షి) :** గత బిఆర్ఎస్ హయాంలో తన ఫోన్ మాత్రమే కాకుండా తన తల్లి, భార్య ఫోన్ నంబర్లను కూడా ట్యాప్ చేసినట్లు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆరోపించారు. సీఎల్పీ హాల్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.'మీ భర్తతో మాట్లాడే విషయాలను వేరే వాళ్లు వింటే మీకు ఎలా ఉంటుంది?' అంటూ ఆయన ప్రశ్నించారు. తన తల్లి పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని పేర్కొన్న ఆయన.. కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం బాధాకరమని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తమ కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. 'ఇంటికి వెళ్తే మా భార్య నన్ను తిడుతోంది. నీ వల్ల నా ఫోన్ కూడా ట్యాప్ చేశారని నా భార్య అడిగితే ఏం చెప్పలేకపోతున్నా' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి రావడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. 'బిజినెస్ చేసుకుంటూ ఉంటే బాగుండేది. రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని ఇప్పుడు ఆలోచిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధ్యులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా చర్యలు చేపడతారనే నమ్మకం ఉందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు.

**CHANGE OF NAME**

I, **Ajitha Anil, W/o Anil Vinod Kumar,** residing at 1-4-332/5, Sathyanagar, New Maruthinagar, Kothapet, Saroornagar, Hyderabad, Telangana - 500035, have changed my name to **Ajitha Anil Vinod Kumar** for all future purposes as per my Passport No. Y3819882.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
02 జూన్ 2026

# ఆహార భద్రతా తనిఖీలను ముమ్మరం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 1 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రత తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆహార వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవ డంతో పాటు అవసరమైన చోట జరిమానాలు విధించా లని కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించా రు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో ఆహార భద్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయా లని అధికారులను ఆదేశిం చారు. విద్యార్థులకు అంది స్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానా లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆమె సూచించారు.ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో కృత్రిమ పక్వా నికి పాల్పడే వ్యాపా రులపై ప్రత్యేక నిఘా ఉంచా లని అధికారులకు సూచిం చారు. కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలను ఉపయోగించి పండ్లను పక్వానికి తెచ్చే వారిపై తని ఖీలు నిర్వహించి, నిబంధన ల ప్రకారం చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల సమన్వయంతో పట్టణంలోని పండ్ల గోదాములను తనిఖీ చేయాలన్నారు. వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందేలా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, ఆహార వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొం దాలని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ప్రతి నెల ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో లైసెన్స్/రిజిస్ట్రేషన్ మేళా నిర్వహి స్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన ఆహార వ్యాపారులు కార్యాలయాన్ని సందర్శించి లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మౌనిక నారాయ ణపేట జిల్లాలో ఆహార భద్రత అమలు, నిర్వహించిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, ఆహార వ్యాపార సంస్థలపై తీసుకున్న చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక గురించి కలెక్టర్‌కు క్లుప్తంగా వివరించారు.అలాగే జిల్లాలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరంగా తెలియజేశారు. సమావేశం లో వివిధ శాఖల అధికా రులు, కమిటీ సభ్యులు, సంబంధిత విభాగాల ప్రతి నిధులు జిల్లా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమో హన్, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లుల సాధన కోసం సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి యత్నం

- వెళ్లకుండా మాజీ సర్పంచులను అడ్డుకున్న పోలీసులు



**బెజ్జంకి, జూన్ 1 (జనం సాక్షి) :** మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన మాజీ సర్పంచులను సోమవారం ముందస్తుగా పోలీసులు పోలీస్ స్టేషన్‌లొ నిర్బంధించారు.మాజీ సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పనులు పూర్తి చేసి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో మాజీ సర్పంచులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీనివాస్ గౌడ్,మొండయ్య,తిరుపతి రెడ్డి,శ్రీనివాస్,స్వామి,నరేష్,మల్లేశం,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమయపాలన పాటించాలి

- వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి
- రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలి
- వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని లలితా దేవి



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కె. లలితాదేవి ప్రభుత్వ డాక్టర్లకు సూచించారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట్ ఏరియా ఆసుపత్రి, తాలేల్మ, నేరేడిగుంట పీహెచ్‌సీలను వైద్యాధికారిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు. ఆయా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని, వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సిబ్బంది సమయం పాలనపాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై నిలదీసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

- రైతులతో కలిసి బైఠాయించిన అంజిరెడ్డి
- దిగివచ్చిన అధికారులు



**మెదక్, జూన్ 1 (జనం సాక్షి) :** రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ ఐకేపీ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత, ఆందోళన నెలకొంది. రైతుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, వారితో కలిసి ఐకేపీ సెంటర్ వద్ద బైఠాయించారు. ఐకేపీ కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా అధికారులు కొనుగోలు చేయకపోవడం, లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ అంజిరెడ్డి రైతులతో కలిసి అక్కడికక్కడే ధర్నాకు దిగారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ రైతులతో కలిసి బైఠాయించడంతో రంగంలోకి దిగిన జిల్లా పౌరసరఫరాల అధికారి, ఇతర ఉన్నతాధికారులు తక్షణమే స్పందించారు.నిరసన స్థలానికి చేరుకున్న అధికారులు, ఉన్నపళంగా ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ఐకేపీ కేంద్రానికి రప్పించారు. అధికారుల సమక్షంలోనే నిలిచిపోయిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, లారీల్లోకి లోడ్ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కష్టపడి పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు.' ఐకేపీ కేంద్రాల్లో లారీల కొరతను సాకుగా చూపి రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఆలస్యం పునరావృతమైతే ఆందోళనలు మరింత తీవ్రం చేస్తాం. ' అని అంజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ గారు బీజేపీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి టౌన్, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లాలో డివిజన్ వారీగా, కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 05, ఆందోల్ డివిజన్‌కు 01, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 20 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టు, గుడ్డేందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న సీఎం రేవంత్ రెడ్డి ధరూరు మండలంలోని జూరాల ప్రాజెక్టు, గుడ్డేందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, వనపర్తి ఎస్పీ సునీత రెడ్డితో కలిసి ప్రాజెక్టు తదితర పరిసర ప్రాంతాల్లో హెలిపాడ్ నిర్మాణం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. జూరాల ప్రాజెక్టు సమీపంలోని రేవులపల్లి గ్రామం జెన్కో క్వార్టర్స్‌లో, రామాలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో, తదితర ప్రాంతాల్లో హెలిపాడ్ ఏర్పాటు చేసేందుకు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలిపాడ్ నుంచి ఆయా ప్రాజెక్టును సందర్శించే దారిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. రెండు రోజులే సమయం ఉండడంతో సీఎం పర్యటించే కాన్వాయ్ రహదారులను మరమ్మత్తు చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ఉంటే సరి చేయించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన చోట బారికేడ్లతో పాటు ఇతర ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పి మొగిలయ్య, ఇరిగేషన్ ఈఈ సంజీవ్ ప్రసాద్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ హైమావతి




**సిద్దిపేట బ్యూరో, జూన్ 1 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జూన్ 1వ తేది నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కే.హైమావతి జిల్లా అటవీశాఖ అధికారి పద్మజారాణి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ ప్రాముఖ్యతను తెలుపుతూ మరియు అడవులు వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జూన్ 1 నుండి 12వ తేదీ వరకు అటవీశాఖ మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారిచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, భాగస్వాములై పర్యావరణ పరిరక్షణ, మరియు అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలని, అటవీ శాఖ అధికారులు పర్యావరణ పరిరక్షణలో అడవులు, వన్యప్రాణుల, ప్రాముఖ్యత పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, అటవీశాఖ అధికారులు, ఇతర అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ చేస్తూ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి



**జడ్చర్ల, జూన్ 1 (జనంసాక్షి) :** మండలంలో గత మూడు నెలలుగా ఉపాధి కూలీలకు డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు వెంటనే బకాయిలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి. జగన్ డిమాండ్ చేశారు. కూలీల సమస్యలపై స్పందిస్తూ రెండు పూటలా ఫోటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలని, రోజు కూలి రూ. 600లకు పెంచాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో విజయ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. రాంజీ చట్టాన్ని రద్దు చేసి, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అలాగే జూన్ 20, 21, 22 తేదీల్లో మహబూబ్నగర్ లో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలను కూలీలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, యాదయ్య, జయ రాములు, శ్యాంసుందర్, రామచంద్రయ్య, మహేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా విద్యాశాఖాధికారికి ఏబీవీపీ వినతిపత్రం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 1 (జనంసాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రమేష్ కు ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంబంధించి సోమవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ మొక్తాల శంతన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల ఖాళీలు, తగిన తరగతి గదుల లేమి, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల కొరత, ఫర్నిచర్ లేకపోవడం, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ మరియు ఇతర విద్యా సామగ్రి అందుబాటులో ఉండేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు.అదేవిధంగా జిల్లాలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను కఠినంగా అమలు చేసి,అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. పాఠశాలలయాజమాన్యాలు విద్యార్థుల విద్యను వ్యాపారంగా మార్చకుండా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును తప్పనిసరిగా అమలు చేయాలని, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ నిబంధన అమలుపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం మరియు సమాన విద్యావకాశాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం, విద్యాశాఖ తక్షణ చర్యలు చేపట్టాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా స్పందించాలని విజ్ఞప్తి చేసింది.అనంతరం ఏబీవీపీ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, విష్ణు నాయుడు, జీవన్, చందు, తదితర ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు మృతుల కుటుంబాలకు మంత్రుల పరామర్శ

- తక్షణ సాయం రూ.30 వేలు



**రెబ్బెన,జూన్01(జనంసాక్షి):** రెబ్బెన మండలంలో పిడుగుపాటుకు మృతి చెందిన దంపతుల కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క పరామర్శించారు. మృతుల స్వగ్రామంలో కుటుంబ సభ్యులను ఓదార్చి, తక్షణ సాయం కింద రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేందుకు చర్యలు తీసుకుంటాం" అని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల్లో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, వారి పిల్లల చదువు, జీవనోపాధికి అవసరమైన సహాయం చేస్తామని తెలిపారు.కొలాం గిరిజనులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

పిడుగుపాటుకు మృతి చెందిన టేకం భీమ్–రాజు భాయ్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మృతుల కుటుంబాన్ని ఆమె పరామర్శించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వర్షాకాలంలో ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని గిరిజనులకు సూచించారు. ప్రభుత్వం తరపున మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు చేపడతాం. పిల్లల భవిష్యత్తుకు అండగా ఉంటాం అని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.మండలంలోని కొలాం గూడెంలో నివసిస్తున్న పివిడిజి కు చెందిన 50 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.శిథిలావస్థలో ఉన్న గుడిసెలను పరిశీలించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆసిఫాబాద్ నియోజవర్గ ఇన్చార్జి శ్యామ్ నాయక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు నైతం రామచందర్, హేమలత, జిల్లా కార్యదర్శి కుర్సెంగ శోభన్, ప్రధాన కార్యదర్శి బుద్ధి విజయ్, పార్టీ నాయకులు బొల్లం వెంకన్న, అంకం గౌరయ్య, బుర్ర రమేష్ గౌడ్,చుంచు బాబురావు, బుద్దే శేఖర్,రామ్ చందర్, శోభన్,గణపతి,కూన సురేష్, నల్లూరి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## తాండూర్‌లో సీఐటీయూ రాస్తారోకో



**తాండూర్, జూన్ 01( జనం సాక్షి) :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తాండూరు మండల ఐబి కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు హైవే రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా దాగం రాజారాం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ కార్మికులను ఒక్క మాట కూడా ఎవరో ఒకరు అడగడం అనేది జరగలేదని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి,మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులని పర్మినెంట్ చేయాలని, బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని, నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, సంవత్సరానికి ఒక్క కార్మికునికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, మొగిలి , హక్కు, అక్బర్ ,నందిపేట వెంకటి, ఇప్ప రామయ్య, ఇప్పదురుగు, ఇప్ప ఎల్లమ్మ, ఇప్ప సుజాత, కాజీపేట కమల, రామగిరి రాధా, మరియు కార్మికులు పాల్గొన్నారు.

## 14 కిలోల గంజాయి స్వాధీనం

- మహారాష్ట్రకు చెందిన నిందితుడు అరెస్ట్



**బచ్చన్నపేట, జూన్ 1 (జనం సాక్షి) :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి నుండి 14 కిలోల గంజాయిని ట్రాన్స్‌ఫోర్స్ స్థానిక పోలీసులు పట్టుకున్నారు. అనంతరం స్థానిక ఎస్ఐ ఏ.శ్రీకాంత్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలు, వెస్ట్‌జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, మార్గదర్శకత్వంలో బచ్చన్నపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుకున్నామన్నారు. ఒడిశా నుండి గుజరాత్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఓ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ. 8 లక్షల విలువైన 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని మహారాష్ట్రకు చెందిన రాహుల్ అకలేకర్ (తండ్రి: రాజేందర్) సులభంగా డబ్బు సంపాదించి, జల్సాలు చేయాలనే ఉద్దేశంతో ఈ అక్రమ రవాణాకు తెరలేపాడు. తన సహ నిందితులైన అమర్, వినయ్, అక్రమ్‌ల ఆదేశాల మేరకు ఒడిశాలోని బరంపూర్ నుండి గుజరాత్‌లోని వల్సాడ్ ప్రాంతానికి గంజాయిని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో బచ్చన్నపేట బస్ స్టాండ్ ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో నిందితుడు రాహుల్ అకలేకర్ గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడిపై బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఎన్డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితులు (అమర్, వినయ్, అక్రమ్) కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఈ సందర్భంగా నర్మెట్ట సర్కిల్ సిఐ ఎం.అబ్బయ్య, బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్,మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసు శాఖ రాజీలేని వైఖరితో కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేసే ఇలాంటి అక్రమ వ్యసనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జూన్ 2న కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు
- జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 01(జనంసాక్షి) :** జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ములుగు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 8గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు.అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించి, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వేడుకల నిర్వహణకు సంబంధించి వేదిక, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సౌకర్యవంతంగా పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రజలకు చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక

- దళారులను నమ్మి మోసపోవద్దు : మంత్రి శ్రీధర్ బాబు
- ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత






**కాటారం, జూన్ 1 (జనంసాక్షి) :** మంథని నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ప్రజలు దళాలను నన్ను మోసపోవద్దని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎన్ గార్డెన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కాటారం, మల్హర్, మహాదేవపూర్, మహా ముత్తారం మండలాలకు చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని ఈ రోజు పెద్ద ఎత్తున నాలుగు మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించడం జరుగుతుందని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మంజూరైన లబ్ధిదారులు 45 రోజులలోగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ అవసరాలకు సరిపడ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఒక సంవత్సరంలో 20 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించామని తెలిపారు. మహిళలను బస్సులకు అధిపతులు చేయాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు 45 రోజులలోగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఆర్డిఓ రవీందర్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్ రెడ్డి, ఉపాధి హామి పథకం రాష్ట్ర సభ్యులు దండు రమేష్, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల సమ్మయ్య, పిఎసిఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ధన్వాడలో గ్రామపంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం కాటారం మండలం దన్వాడ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంత్రి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్ ఇతర అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ కొంతకాని తిరుమల సమ్మయ్య, ధన్వాడ సర్పంచ్ చిటూరి మహేష్ గౌడ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిగ్నల్స్ రాక వినియోగదారుల సతమతం

- గంటల తరబడి నిలిచిపోతున్న నెట్‌వర్క్ సేవలు



**నెన్నెల్, జూన్ 1 (జనంసాక్షి):** బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల్, మండల కేంద్రంలో జియో నెట్వర్క్ సేవలు తరచూ నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నెట్వర్క్ సిగ్నల్స్ వస్తూ పోతుండటంతో వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆదివారం మధ్యాహ్నం గాలిదుమారం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోగా, జియో నెట్వర్క్ కూడా పూర్తిగా అంతరాయం కలిగింది. అనంతరం రాత్రి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ జియో సిగ్నల్స్ మాత్రం అందుబాటులోకి రాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా ఉన్న సమయాల్లో కూడా గంటల తరబడి నెట్వర్క్ పని చేయకపోవడం సాధారణమైందని వారు వాపోతున్నారు. రీఛార్జ్ గడువు ముగిసిన వెంటనే సేవలను నిలిపివేసే సంస్థ, నెట్వర్క్ లోపాల కారణంగా వినియోగదారులకు కలిగే ఇబ్బందులపై ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇతర టెలికాం సంస్థల సేవలు సక్రమంగా అందుబాటులో ఉన్నప్పటికీ, జియో సేవల్లో తరచూ అంతరాయం ఏర్పడుతుండటం పట్ల వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జియో 5జీ సేవలు అందిస్తున్నామని సంస్థ ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవానికి 5జీ సిగ్నల్ స్థిరంగా అందడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఫోన్‌లో 5జీ గుర్తు కనిపించినప్పటికీ ఇంటర్నెట్ వేగం కనీస స్థాయిలో కూడా లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయని చెబుతున్నారు. నెట్వర్క్ సమస్యలపై జియో సంస్థ అధికారులు వెంటనే స్పందించి, నాణ్యమైన నిరంతర సేవలను అందించేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.



## గాలివాన బీభత్సానికి నేలకొరిగిన చెట్లు

**సారంగాపూర్, జూన్1(జనం సాక్షి) :** సారంగాపూర్ మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది తీవ్రమైన గాలులకు స్వర్ణ కౌట్ల సారంగాపూర్ రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది గ్రామ సర్పంచ్ బల్గురి అజయ్ ఉప సర్పంచ్ శ్రీకాంత్ కౌట్ల శివారులోని చెట్లను మల్టీ పర్పస్ వర్కర్స్ తో రోడ్డుపై నుండి తీయించారు. విద్యుత్ సరఫరా సరి చేయడానికి చర్యలు చేపట్టమని మండల విద్యుత్ అధికారి ఏ ఈ సాయికిరణ్ తెలిపారు.

## ప్రేమతో వలవేసి.. పెళ్లంటే ప్లేట్ ఫిరాయించాడు..!

- నమ్మించి నట్టేట ముంచిన ప్రియుడిపై యువతి 'రణభేరి'
- న్యాయం జరిగే వరకూ కదిలేదే లేదంటూ ప్రియుడి ఇంటి ముందే భీష్మించుకున్న మనీషా...!
- పొగుళ్లపల్లిలో ఉద్రిక్తత...
- రంగంలోకి దిగి సర్దిచెప్పిన ఎస్సై రాజ్ కుమార్



**కొత్తగూడ, జూన్ 1 (జనసాక్షి) :** ప్రేమ పేరుతో రెండేళ్లు నమ్మించి, పెళ్లి చేసుకుంటానని నట్టేట ముంచాడంటూ ఓ యువతి తన ప్రియుడి ఇంటి ముందే న్యాయం కోసం రణభేరి మోగించిన సంచలన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి గ్రామంలో సోమవారం తీవ్ర కలకలం రేపింది. నమ్మకద్రోహానికి పాల్పడిన ప్రియుడి ముసుగును తొలగిస్తూ బాధితురాలు నడిరోడ్డుపైకి వచ్చి చేసిన పోరాటం స్థానికంగా పెను దుమారం రేపింది.

బాధితురాలి వివరాల ప్రకారం.. పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన భైరబోయిన మనీషా, అదే గ్రామానికి చెందిన జూల వంశీ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన వంశీ, మనీషాతో శారీరకంగా, మానసికంగా అత్యంత సన్నిహితంగా మెలిగాడు. ఆమె నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కాలం గడిపాడు. అయితే, ఇటీవల బాధితురాలు పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో వంశీ అసలు రంగు బయటపడింది. పెళ్లి చేసుకోనంటూ మొండికేయడమే కాకుండా, మాట మార్చి మోసానికి తెరలేపాడు. నమ్మినవాడే నట్టేట ముంచేసరికి ఆ యువతి ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ప్రియుడి నమ్మకద్రోహంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన మనీషా.. వెనకడుగు వేయకుండా నిలదీయాలని నిశ్చయించుకుంది. వంశీ ఇంటి గుమ్మం ముందే బైఠాయించి మౌన దీక్షకు దిగింది. నన్ను నమ్మించి ముంచేసిన వంశీ నాకు దక్కాలి.. నాకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదు అంటూ ఆమె చేసిన ఆందోళనతో పొగుళ్లపల్లిలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. బంధువులు భారీగా తరలిరావడంతో గ్రామంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

### తప్పు చేసిన వారిని వదిలేదే లేదు: ఎస్సై రాజ్ కుమార్

యువతి ఆందోళనపై సమాచారం అందుకున్న కొత్తగూడ ఎస్సై రాజ్ కుమార్ తక్షణమే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలితో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించిన ఎస్సై చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోలేరని, బాధితురాలికి వంద శాతం న్యాయం జరిగేలా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎవరికీ అన్యాయం జరగకుండా కేసును అన్ని కోణాల్లో కూలంకషంగా దర్యాప్తు చేస్తామని ఎస్సై స్ట్రాంగ్ హామీ ఇవ్వడంతో, బాధితురాలు తన మౌన పోరాటాన్ని తాత్కాలికంగా విరమించింది.

## అతివేగం ప్రాణం తీసింది

- ద్విచక్ర వాహన ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**ముథోల్, జూన్ 1 (జనం సాక్షి) :** అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ ఓ కుటుంబంలో విషాదం నింపింది. ముథోల్ మండలం జటాశంకర్ సమీపంలో జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తానూర్ మండల కేంద్రానికి చెందిన మిసడే సతీష్ (35) మృతి చెందారు. ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం, లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపే సతీష్ ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అదుపు తప్పాడు. అతివేగంతో వస్తున్న బైక్ రోడ్డు పక్కన ఉన్న మట్టిదిబ్బను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే సతీష్ ప్రాణాలు కోల్పోయాడు. సమయానికి ఇంటికి రాకపోవడంతో సతీష్ కుటుంబీకులు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. సోమవారం ఉదయం జటాశంకర్ సమీపంలో రోడ్డు పక్కన సతీష్ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఓ కుమార్తె ఉంది.

## ప్రభుత్వ దవాఖాన స్థలంలో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ సీరియస్..

- నిర్మాణ పనులు వెంటనే నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆదేశం..



**మహబూబాబాద్ ప్రతినిధి, మే 01 (జనం సాక్షి):** గూడూరు మండలంలోని ప్రభుత్వ దవాఖానకు చెందిన భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు బానోత్ చందు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్పందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని, సంబంధిత భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూడూరు తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం టిబిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా సురేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కాయితోజు దేవేందర్ చారిలు జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్‌ను కలిసి భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించినట్లు సమాచారం. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని రక్షిస్తారా, లేక భూ కబ్జాదారులకు సహకరిస్తారా అనే అంశంపై స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వ దవాఖాన స్థలాన్ని పూర్తిగా పరిరక్షించి, ఆక్రమణలను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని వారు కోరుతున్నారు.

## గుట్కా అక్రమ అమ్మకాలపై పోలీసుల ఉక్కుపాదం



**హనుమకొండ ప్రతినిధి జూన్ 1 (జనంసాక్షి) :** హనుమకొండ నగరంలోని బాలసముద్రం, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఏకకాలంలో పోలీసుల మెరుపు దాడులు నిర్వహించారు.కిరాణా దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.75 వేల విలువైన గుట్కా సీజ్ చేయడం జరిగింది.బాలసముద్రంలో ఆకుల శ్రీనివాస్ దుకాణంలో రూ.23 వేల గుట్కా స్వాధీన పరచుకోవడం జరిగింది.టైలర్ స్ట్రీట్ లోని మహాదేవ్ జనరల్ స్టోర్ లో రూ.52 వేల గుట్కా పట్టుకున్నారు. ప్రభుత్వనిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కటకటాల వెనక్కి వెళ్లవలసిందిగా హెచ్చరించారు. అనంతరం గుట్కా విక్రయదారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్యుద్ఘాతంతో టింబర్ డిపో దగ్ధం

- 5 లక్షల రూపాయల ఆస్తి నష్టం
- బాధితుడిని ఆదుకోవాలి : మాజీ స్పీకర్ మధుసూదనా చారి



**ఆత్మకూరు, జూన్ 1 (జనం సాక్షి) :** ఆత్మకూరు మండలంలోని గుడెప్పాడ్ స్టేజి వద్ద గల భద్రకాళి సా మిల్లు టింబర్ డిపోలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ తో ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగడంతో అందులో ఉన్నటువంటి విలువైన కలప దగ్ధం అయింది అని బాధితుడు తెలిపారు. భారీగా మంటలు చెలరేగడంతో స్థానిక కరెంట్ ఏఈ కి ఫోన్ చేసి విద్యుత్ ఆపు చేయించారు. తదనంతరం ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించగా ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆపివేసిందని లేనిచో భారీ ప్రమాదం తప్పిందని తెలిపారు. దగ్ధం అయిన కలప విలువ సుమారు 5 లక్షల రూపాయలు ఉంటుందని తాను ఐదు లక్షల రూపాయలు నష్టపోయినని బాధితుడు కన్నీరు మున్ని రు అయినాడు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లోను ఆత్మకూరు తహసిల్దారు కు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశానన్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి టింబర్ డిపో పరిశీలించి బాధితుడి కి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ స్పీకర్ మధుసూదనా చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
02 జూన్ 2026

# యువతకు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాలు , కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తి పరమైన శిక్షణ ఎంతో అవసరమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం (టీం సొసైటీ) మరియు మ్యాజిక్ బస్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణా తరగతులు భువనగిరి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా, టీం సొసైటీ ఫండ్స్ నిధులతో 12 రోజులపాటు నిర్వహించే ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు ఇంటర్వ్యూ స్కిల్స్ శిక్షణా శిబిరాన్ని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక



నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జి.పి.టి పాత్ర ఎంతో కీలకమైనదని, ఇటువంటి అత్యాధునిక సాంకేతికతపై జిల్లా యువతకు ఉచితంగా శిక్షణ అందించడం అభినందనీయమని కొనియాడారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ యువకులను దృష్టిలో పెట్టుకొని వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశం పొందేందుకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడం, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలను పొందెందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి , జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి, ఆర్డీవో కృష్ణారెడ్డి, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్ల క్షేత్రస్థాయి తనిఖీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రభుత్వ హాస్టళ్ల క్షేత్రస్థాయి తనిఖీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అక్కడ ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, మరమ్మతుల అవసరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత స్పెషల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల స్పెషల్ అధికారులకు ఆన్‌లైన్ యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నమోదు చేసిన వివరాల ఆధారంగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు నిర్దేశిత గడువులోగా సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు.

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. కామేపల్లి మండలం సాతాని గూడెం గ్రామానికి చెందిన కన్నేటీ రంగయ్య ముచ్చర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 255, 262లో ఆరు ఎకరాల 20 గుంటలు వ్యవసాయ సాగు భూమి ఉందని, ఈ పొలంలోకి వెళ్ళుటకు దారి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన ఎం.వెన్నెల తనకు తల్లి తండ్రులు లేరని, 10వ తరగతి ఉత్తీర్ణత 493 మార్కులతో సాధించడం జరిగిందని, తనకు ఎం.పి.హెచ్.డబ్ల్యూ లో సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్.సి.ఓ బీసీ సంక్షేమ శాఖకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మికులకు అందించే ప్రసూతి ఆర్థిక సహాయం తనకు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, లేబర్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అందరి విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య




**మొయినాబాద్, జూన్ 1 (జనం సాక్షి) :** విద్య, వైద్యం ప్రజలకు సక్రమంగా అందించినప్పుడే ప్రజలందరూ అన్ని రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ఆరోగ్యంగా ఉంటారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ అంగన్వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు సరస్వతీ, సర్పంచ్ మధ్యపాగ కృష్ణ ఆధ్వర్యంలో అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన యూనిఫామ్ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా వంపిణీ చేశారు. ఈసందర్భంగా పిల్లలకు దుస్తులు వంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అందరికి నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. విజ్ఞానవంతులుగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తే వారికి ప్రభుత్వం ద్వారా దుస్తులు, పాఠ్య పుస్తకాలు, ఉదయం టిఫిన్స్, మధ్యాహ్నం భోజనం అందిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించిన విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, అమ్డాపూర్ సర్పంచ్ మధ్యపాగ కృష్ణ, నాయకులు మన్నె ప్రభాకర్రెడ్డి, గుంటం సైపాల్రెడ్డి, వట్నం రాంరెడ్డి, బాత్కు అంజయ్య, ఈగ రవీందర్రెడ్డి, ఉపసర్పంచ్ జితేందర్రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి అధికారులు, ఎంపీడీవో హిమబిందు, హౌసింగ్ అధికారులు, వంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 1 (జనం సాక్షి) :** వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం మరియు రానున్న వర్షాకాలంలో ప్రబలే కీటక జనిత మరియు నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ముందస్తు చర్యలను చేపట్టాలని ముఖ్యంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ, నీటి నిల్వలు తొలగింపు,



దోమల నివారణ చర్యలు మరియు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఓవర్ హెడ్ ట్యాంక్ లు శుభ్రపరిచి, ప్రతి 2, 12, 22 రోజులకి నీటి నాణ్యత పరిక్ష రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించడం జరిగింది. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాల అమలు, గత రెండేళ్ల డెంగ్యూ కేసుల విశ్లేషణ, పరీక్షా సదుపాయాల లభ్యత, పీహెచ్సీలలో రాపిడ్ టెస్ట్ కిట్ల నిలువలు ఎన్ సి డి, ఆర్ బి ఎస్ కే కార్యక్రమాల పురోగతి, ఎన్ క్యూ ఏ ఎస్ కింద ఎంపికైన 11 పీహెచ్సీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, ప్రభుత్వ వైద్య సంస్థల్లో ప్రసవాల తులనాత్మక విశ్లేషణ, వర్షాకాల ముంపు ప్రాంతాల గుర్తింపు, శిథిలావస్థ భవనాలపై చర్యలు, అలాగే గ్రామాలు మరియు పట్టణాల్లో నీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ మరియు నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా వైద్య ఌ ఆరోగ్య అధికారి డా. మనోహర్, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డిప్యూటీ డిఎంహెచ్వోలు జిల్లా అధికారులు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**కల్లూరు, జూన్ 1 (జనం సాక్షి) :** కల్లూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఆరుగురు విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి గాను బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత విద్య సంవత్సరంలోపదో తరగతి చదివి ప్రతిభ చాటిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు.



అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీ ప్రవేశానికి అర్హత సాధించినట్లు సంబంధిత గవర్నమెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ మేరకు జూన్ 5వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు విద్యార్థులకు సమాచారం అందింది. బాసర ట్రిపుల్ ఐటీ లోసీట్లు సాధించిన విద్యార్థులు కల్లూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆర్. శివనందిని, ఎస్.కే. ఫరీదా, కె. జోస్తవిక, అలాగే పీఎం శ్రీ గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థి మోదుగు రామచరణ్, చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయి వెన్నెల, చిన్న కోరుకొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇంటి త్రిష. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభను చాటిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత అభినందించారు. అదేవిధంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పొదిలి పద్మ, రమణయ్య, శ్రీనివాసరావు తదితరులు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాసర ట్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించి వారి విజయాన్ని ప్రశంసించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 1 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 57 దరఖాస్తులు, డీపీఓ 6, మున్సిపాలిటీ 6, డిడబ్ల్యూఓ 4, మిగిలిన 30 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 103 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డీఏవో, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిఈఓ అశోక్, డిసిఓ ప్రవీణ్, డివైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సి సంక్షేమ అధికారి దయానందరాణి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మితో ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూన్ 1 (జనంసాక్షి) :** పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో కళ్యాణ లక్ష్మి పథకం కీలక పాత్ర పోషిస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు



కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 38 మంది లబ్ధిదారులకు రూ.38,00,618 విలువైన ఆర్థిక సహాయాన్ని అందించినట్లు వెల్లడించారు. నిరుపేద కుటుంబాలు వివాహాల సమయంలో ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనలో ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని ఎమ్మెల్యే కాలే యాదయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, కౌన్సిలర్లు కళ్యాణి యాదగిరి, మాధవియాది రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, పెంటయ్య గౌడ్, వీరేందర్ రెడ్డి, సర్పంచులు గుండన్నగారి ప్రభాకర్ రెడ్డి, గౌడిచర్ల శ్రీనివాస్, గోటూరి రామచంద్రయ్య గౌడ్, మైపాల్ రెడ్డి, నాయకులు మల్గారి జనార్దన్ రెడ్డి, పడాల ప్రభాకర్, కేశారం శ్రీనివాస్, రాములు, మల్గారి కార్తీక్ రెడ్డి, పాండు యాదవ్, టేకులపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, తహసిల్దార్ కృష్ణయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాళాలు వీడని పశు వైద్యశాల

- రైతుల తీవ్ర ఆవేదన
- సమయానికి తెరవని సిబ్బంది
- తెరిచినా నో స్టాఫ్
- మాడుగులపల్లి మండలం కన్నకల్లు పశువుల
- దవాఖానాలో దారుణం
- వారంలో మొదటి రోజే మూగజీవాలతో రైతుల పడిగాపులు

**మాడుగులపల్లి, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా కొందరు ప్రభుత్వోద్యోగుల తీరు మాత్రం మారడం లేదు మూగజీవాల ప్రాణాలు కాపాడాల్సిన పశువైద్యశాల అధికారుల నిర్లక్ష్యానికి, సిబ్బంది బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కన్నకల్లు గ్రామ పశువైద్యశాల నిర్వహణ తీరుపై స్థానిక రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది అసలు ఆసుపత్రి ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందని రైతులు మండిపడుతున్నారు వారంలో మొదటి రోజైన సోమవారం ఉదయం నుంచే పశువులకు వైద్యం చేయించుకోవడానికి, మందుల కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు ఆసుపత్రికి తరలివచ్చారు తీరా వచ్చి చూసేసరికి పశువైద్యశాల మెయిన్ గేటుకు పెద్ద తాళం దర్శనమిచ్చింది గంటల తరబడి రైతులు ఎండలో వేచి చూసినా తాళం తీసే నాథుడే కరువయ్యాడు ఇక్కడి సిబ్బందికి ఇష్టమొచ్చినప్పుడు వస్తారు, ఇష్టమొచ్చినప్పుడు పోతారు అసలు సమయానికి తాళమే తీయరు ఒకవేళ ఏ గొడవో జరిగి తాళం తీసినా లోపల బోర్డులు తప్ప ఒక్క అధికారి గానీ, సిబ్బంది గానీ కనిపించరు అత్యవసర లో మా మూగజీవాల ప్రాణాలు పోతుంటే ఎవరికి చెప్పుకోవాలి? ప్రైవేట్ డాక్టర్లను పిలిపించి వేల రూపాయలు తగలేయాలా? అని అక్కడికి వచ్చిన రైతులు తీవ్ర ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేశారు. కన్నకల్లు పశువైద్యశాల సిబ్బంది అసలు విధులకు హాజరవుతున్నారా? లేక కేవలం సంతకాలకే



పరిమితమవుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి స్థానిక పర్యవేక్షణ లోపం వల్లే సిబ్బంది ఇంతలా బరితెగిస్తున్నారని గ్రామస్థులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు ఈ నిరంతర నిర్లక్ష్యంపై జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, కన్నకల్లు పశువైద్యశాలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని బాధితుల గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి




**యాదాద్రి కరెస్పాండెంట్, జూన్ 1 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 89 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో రెవిన్యూ శాఖ 46, జిల్లా గ్రామీణాభివృది 8, డివిజనల్ పంచాయతీ 5, మున్సిపాలిటీ 4, పిడి హౌసింగ్ 3, సివిల్ సప్లై 2, మైనింగ్ 2, సర్వే ల్యాండ్ 2, జిల్లా పరిషత్ 2, ఇరిగేషన్ 2, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్, పశుసంవర్ధక, యస్ సి కార్పొరేషన్, శిశు సంక్షేమ, బీసీ వెల్ఫేర్, ఎంప్లాయిమెంట్, మత్స్య, చేనేత, అగ్రికల్చర్, విద్య, లీగల్ సెల్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# పర్సనల్ కంప్యూటర్లలోకి ఎన్విడియా చిప్‌లు..

## విండోస్ ల్యాప్‌టాప్ మార్కెట్లోకి ప్రవేశం..!

**న్యూఢిల్లీ:**టెక్ దిగ్గజం ఎన్విడియా తాజాగా పీసీ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటిం చింది. తైవాన్‌లో జరుగుతోన్న కంప్యూటెక్ ట్రేడ్ షో వేదికగా ఆ కంపెనీ సీఈవో జెన్సన్ హువాంగ్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఇప్పటికే ఈ రంగంలో పట్టు కోల్పోతోన్న ఇంటెల్ కార్పొరేషన్ నుంచి మార్కెట్ షేర్‌ను దక్కించుకోవాలనే లక్ష్యంతో ఎన్విడియా ఈ దిశగా అడుగులు వేసినట్లు తెలుస్తోంది.ఎన్విడియా త్వరలోనే తన సరికొత్త 'ఆర్టీఎక్స్ స్పార్క్ సూపర్ చిప్'ను ప్రముఖ పీసీ బ్రాండ్స్‌కు చెందిన ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌ల్లో అందుబాటులోకి తీసుకురానుంది. మైక్రోప్రాసెసర్, గ్రాఫిక్స్ చిప్‌ను కలిపి దీనిని రూపొందించినట్లు జెన్సన్ హువాంగ్ వెల్లడించారు. తైవాన్ మీడియాటెక్ ఐఎన్‌సీ సహకారంతో దీనిని తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఆర్మ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారిత మైక్రోసాఫ్ట్ విండోస్‌ను రన్ చేస్తుంది.ఎన్విడియా ఇప్పటికే డేటా సెంటర్ల మార్కెట్లో అత్యంత కీలకమైంది. తాజాగా పర్సనల్ కంప్యూటర్ల రంగంలోకి అడుగు పెట్టడంతో ఇప్పటికే ఉన్న కంపెనీలకు తీవ్రమైన పోటీ ఇవ్వనుంది. దాదాపు దశాబ్దం క్రితం ఈ మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఎన్విడియా చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. ఈ సారి మాత్రం తన స్థానాన్ని సుస్థిరం చేసుకొనేందుకు ప్రత్యర్థుల కంటే అధిక మొత్తంలో ఆర్థిక వనరులను కేటాయించగలిగే స్థితిలో ఉంది. ఇక, ఈ ప్రయత్నంతో కృత్రిమ మేధ అభివృద్ధి, వినియోగంలో కూడా తాను కేంద్రంగా కొనసాగేందుకు ఎన్విడియాకు అవకాశం లభిస్తుంది.ప్రీమియం సెగ్మెంట్‌ను లక్ష్యంగా చేసుకొని ఆర్టీఎక్స్ స్పార్క్ చిప్‌ల ల్యాప్‌టాప్‌లను తొలుత సిద్ధం చేసే అవకాశం ఉంది. ఈ చిప్ వినియోగంతో అత్యంత నాజుకుగా ఉండే శక్తిమంతమైన కంప్యూటర్లను తయారు చేసే అవకాశం పీసీ తయారీదారులకు లభించనుంది.మైక్రోసాఫ్ట్ తన అత్యాధునిక సర్ఫేస్ ల్యాప్‌టాప్ అల్ట్రాను ఆవిష్కరించింది. ఎన్విడియా నుంచి పీసీ మార్కెట్‌పై ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. దీనిలో తొలిసారిగా ఎన్విడియా చిప్‌ను వాడినట్లు మైక్రోసాఫ్ట్ పేర్కొంది. తాము రూపొందించిన అతి శక్తిమంతమైన సర్ఫేస్ ల్యాప్‌టాప్ ఇదే అని తెలిపింది. అయితే దీని ధరకు సంబంధించి ఎటువంటి వివరాలను మైక్రోసాఫ్ట్ వెల్లడించలేదు.



# ఆరంభ లాభాలు ఆవిరి..


## 508 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. పశ్చిమాసియాలోని శాంతిపై అనిశ్చితి నెలకొనడం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి.సెన్సెక్స్ ఉదయం 75,203.02 (క్రితం ముగింపు 74,775.74) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,367.93 వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 508.40 పాయింట్ల నష్టంతో 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల నష్టంతో 23,382.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఇండిగో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.01 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,496 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



**ఆర్‌బీఐ నిర్ణయాలు.. యుద్ధ పరిణామాలే కీలకం**

పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, జూన్ 5న వెలువడే ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలు, ముడిచమురు ధరలు, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి.. ఈవారం మన మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకాలు చేయకపోవడం, స్టాక్ మార్కెట్ల ఊగిసలాటకు దోహదం చేయొచ్చు. ఈనెల 3-5 తేదీల్లో జరిగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరపతి విధాన కమిటీ సమావేశంలో వడ్డీరేట్లను సవరించక పోవచ్చనే విశ్లేషకులు భావిస్తున్నారు. 2025-26 జనవరి-మార్చి, పూర్తి ఆర్థిక సంవత్సర జీడీపీ గణాంకాలు కూడా 5నే వెలువడనున్నాయి. మార్చి త్రైమాసికంలో 7.2%, పూర్తి ఆర్థికంలో 7.5% వృద్ధిరేటు నమోదు కావచ్చున్నది అంచనా. ఇవి కూడా సూచీలకు దిశానిర్దేశం చేస్తాయి. స్పష్టమైన దిశ కనిపించే వరకు, మార్కెట్లలో అప్రమత్తత కొనసాగుతుందని బ్రోకరేజీలు చెబుతున్నాయి. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) మే నెలలో రూ.32,963 కోట్ల అమ్మకాలు జరిపారు. ఈ ఏడాదిలో ఇప్పటికే వీరి విక్రయాలు రూ.2.25 లక్షల కోట్లకు చేరాయి. 2025 మొత్తంమీద అమ్మిన రూ.1.66 లక్షల కోట్ల కంటే ఈ మొత్తమే ఎక్కువ. నిఫ్టీ-50 సూచీ 24,000 స్థాయిని అధిగమిస్తేనే సానుకూలతలు కనిపిస్తాయని, అంత వరకు ఒక శ్రేణికి లోబడే కదలాడొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ముడి చమురు ధరలు ఇంకా దిగి వస్తేనే విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు చేపడతారన్నది అంచనా. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. స్థూల ఆర్థిక మూలాలు స్థిరంగా ఉన్నా, వినియోగదారు విశ్వాసం బలహీనపడడం ఇందుకు కారణం.పశ్చిమాసియా యుద్ధానికి పరిష్కారం లభించే వరకు లోహ కంపెనీల షేర్లు ముఖ్యంగా ఫెర్రస్ సంబంధిత స్క్రిప్‌లు రాణించొచ్చు. సరఫరా ఆటంకాల వల్ల ఉక్కు ధరలు పెరుగుతూ ఉండడంతో కంపెనీల మార్జిన్లకు మద్దతు లభిస్తోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నుంచి రక్షించుకోవడానికి ఔషధ కంపెనీల షేర్లపై మదుపర్లు ఆసక్తి చూపొచ్చు. రాబోయే త్రైమాసికాల్లో దేశీయ విక్రయాలపై ఆధారపడే కంపెనీలు రాణించొచ్చు. నిఫ్టీ ఫార్మా సూచీ పడ్డపుడల్లా ట్రేడర్లు కొనుగోలు చేయొచ్చు. సిమెంటు కంపెనీల భవిష్యత్ అంచనాలు సానుకూలంగా ఉన్నా, సాంకేతిక చార్టుల్లో చూస్తే ఈ వారమూ నష్టపోవడానికే అవకాశాలున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్ల కంటే తక్కువగానే ఉన్నందున, ఈ షేర్ల నష్టాలు పరిమితం కావొచ్చు. మే నెల టోకు విక్రయ గణాంకాలకు అనుగుణంగా వాహన కంపెనీల షేర్లు సోమవారం స్పందించొచ్చు. వాహనాలకు గిరాకీ స్థిరంగానే ఉంటుందన్నది అంచనా. ఇంధన, రవాణా వ్యయాలు, సరఫరా వ్యవస్థ ఆటంకాలు, కమొడిటీ ధరలనూ గమనించాలి.ముడి చమురు ధర తగ్గినా, దేశీయంగా ఇంధన మార్కెటింగ్ కంపెనీల షేర్లు విక్రయాల ఒత్తిడిలో కొనసాగొచ్చు. పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలు, ఇప్పటికీ ఉత్పత్తి ధర కంటే తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. రాబోయే త్రైమాసికాల్లో ఈ కంపెనీలు నష్టాలను నమోదు చేస్తాయన్నది అంచనా.నిఫ్టీ బ్యాంక్ సూచీ ఒక శ్రేణిలోనే చలించొచ్చు. నాయకత్వం, నియంత్రణ విషయంలో ఉన్న ప్రశ్నల కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు వెలుగు లోకి రావొచ్చు.ప్రధాన వార్తలేమీ లేనందున టెలికాం షేర్లకు తటస్థం/సానుకూల అంచనాలనే విశ్లేషకులు వెలువరిస్తున్నారు. ఈ రంగ సూచీకి తక్షణ మద్దతు 3,500 వద్ద, నిరోధం 3,588 వద్ద కనిపిస్తోంది. యుద్ధ విరామ ఒప్పందంపై అనిశ్చితి కారణంగా, యంత్రపరికరాల కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ఒప్పందం కుదిరితే ఈ రంగానికి సానుకూలతలు లభిస్తాయి. కమొడిటీ అధిక ధరల వల్ల కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి ఉంటుంది. ఐటీ షేర్లు కూడా ఒక శ్రేణిలోనే ట్రేడవవచ్చు.2 వారాలుగా కనిపిస్తున్న సానుకూలతలు కొనసాగుతాయని కొంత మంది, ప్రతికూల ధోరణికి అవకాశం ఉందని మరికొంత మంది విశ్లేషకులు అంటున్నారు.




# విమానయాన సంస్థలకు ఊరట..

## జెట్ ఫ్యూయల్ ధర 27% తగ్గింపు

దిల్లీ: విమానయాన సంస్థలకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అంతర్జాతీయ విమానాల జెట్ ఇంధన ధరలను 27 శాతం తగ్గించాయి. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరల కారణంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థలకు రక్షణ కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. దేశీయ విమాన ఇంధన ధరల్లో మాత్రం వరుసగా రెండో నెలా ఎలాంటి మార్పూ చేయలేదు.జూన్ నెలకు గాను అంతర్జాతీయ విమానాల జెట్ ఇంధన ధరను కిలోలీటరుకు సుమారు 400 డాలర్ల మేర చమురు సంస్థలు తగ్గించాయి. దీంతో కిలోలీటర్ 1100 డాలర్లకు చేరింది. ఈ తగ్గింపుతో అంతర్జాతీయ విమానాల ఇంధన ధరలు, దేశీయ విమాన ఇంధన ధరలు దాదాపు సమాన స్థాయికి చేరాయి. అంతర్జాతీయ విమాన ఇంధన ధర కిలో లీటరుకు రూ.1,05,000గా ఉండగా.. ప్రస్తుతం దిల్లీలో దేశీయ విమాన ఇంధన ధర కిలోలీటరుకు రూ.1,04,927గా ఉంది.అంతకుముందు దేశీయ విమానాలకు ఏప్రిల్ 1న కిలోలీటరుకు 25 శాతం అంటే రూ.15వేలు చొప్పున పెంచగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల ఏటీఎఫ్ ధరలు మాత్రం రూ.73 వేలు పెంచారు. మే నెలలో అంతర్జాతీయ విమానాలకు ఏటీఎఫ్ ధరను కిలో లీటరుకు 76 డాలర్లు పెంచి 1511 డాలర్లుకు చేర్చారు. దేశీయ విమానాల ధరల్లో అప్పుడు ఏ మార్పూ చేయలేదు. జూన్‌లో మాత్రం కిలో లీటరుకు 400 డాలర్లు తగ్గించడం గమనార్హం.

విమాన సంస్థలకు పెద్ద ఊరట

సాధారణంగా ఎయిర్‌లైన్స్ నిర్వహణ వ్యయంలో జెట్ ఫ్యూయల్‌కే 40 శాతం ఖర్చవుతుంది. ఇటీవలి పరిస్థితుల కారణంగా ఇది 55-60 శాతానికి పెరిగింది. పెరిగిన చమురు ధరలకు తోడు, పశ్చిమాసియా యుద్ధ వాతావరణం వల్ల విమానాలు సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రముఖ విమానయాన సంస్థలు టికెట్ ధరపై సర్‌ఛార్జి విధించడం ప్రారంభించాయి.

# హర్మూజ్‌కు ప్రత్యామ్నాయం దొరికినట్లేనా..?

## భారత్-ఒమన్ డీల్‌పై ఆశలు

**న్యూఢిల్లీ:**చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో చిక్కుకోవడం భారత్‌కు ఇబ్బందికరంగా మారింది. ఈ పరిణామాల వేళ భారత్-ఒమన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ట్రేడ్ డీల్ తో హర్మూజ్ మీద ఆధారపడకుండా చమురు దిగుమతుల కోసం భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం దొరికినట్లేనని వాణిజ్య నిపుణులు భావిస్తున్నారు.వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్, ఒమన్ మధ్య ఈ చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. గతేడాది డిసెంబరులో ప్రధాని మోదీ మస్కట్ పర్యటనకు వెళ్లినప్పుడు ఇరు దేశాల ప్రతినిధులు దీనిపై సంతకాలు చేశారు. ఈ జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. దీని కింద ఇరు దేశాలు పలు రకాల దిగుమతులకు సుంకాలను మినహాయించాయి. ఈ ఒప్పందంతో భారత్ నుంచి ఒమన్‌కు ఎగుమతయ్యే 99.38శాతం ఉత్పత్తులకు ఇకపై ఎలాంటి సుంకం ఉండదు. రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్స్, ఫర్నీచర్, వ్యవసాయ, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలు, మెడికల్ పరికరాలు, ఆటోమొబైల్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. టారిఫ్ మినహాయింపులతో మన దేశ ఉత్పత్తులకు ఒమన్‌లో మరింత మార్కెట్ లభించనుంది. ఇక, మస్కట్ నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తుల్లో 78శాతం వాటికి భారత్ ఈ డీల్ కింద సుంకం మినహాయించింది.


లొకేషన్‌తో లాభం..

ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలో 20శాతం హర్మూజ్ మీదుగానే సరఫరా అవుతుండంతో వ్యూహాత్మకంగా ఇది అత్యంత కీలకమైన జలసంధి. కానీ, గత కొన్నిరోజులుగా అమెరికా-ఇరాన్ యుద్ధంతో ఈ జలమార్గంలో చమురు, ఇతర నౌకల రవాణాకు అంతరాయం కలిగింది. ఒమన్‌తో డీల్ కుదరడంతో హర్మూజ్‌ను పక్కనబెట్టి గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులు పెంచుకునే అవకాశాలు లభించినట్లయ్యింది. ఒమన్ తీరప్రాంతంలో అధిక భాగం ఈ జలసంధికి వెలుపలే ఉంటుంది. ఇది గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రానికి ఆనుకుని ఉంటుంది. అందువల్ల హర్మూజ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన సమయాల్లోనూ సలాలా, దుఖ్మ్ వంటి పోర్టుల నుంచి భారత్ ఇంధన సరఫరా చేసుకునే వీలుంటుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ పోర్టుల నుంచి భారత్ చమురు దిగుమతులను పెంచింది.గతేడాది ఏప్రిల్‌లో గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు 15 బిలియన్ డాలర్ల మేర విలువైన ఉత్పత్తులు దిగుమతి అయ్యాయి. కానీ, ఈసారి పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఏప్రిల్ నెలలో ఆ దిగుమతులు 9.8 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అదే సమయంలో ఒమన్ నుంచి మన దేశానికి దిగుమతులు ఏకంగా 246.4శాతం పెరిగి 1.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో అత్యధికం ముడిచమురు, యూరియానే కావడం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.2 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఒమన్ నుంచి దిగుమతి చేసుకుంది. ఇందులో చమురు విలువ 1.6 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 1.2 బిలియన్ డాలర్ల విలువైన ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకుంది. ఇదే సమయంలో మస్కట్‌కు మన దేశం నుంచి ఎగుమతుల విలువ 3.64 బిలియన్ డాలర్లుగా ఉంది. వీటిలో అత్యధికం రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు, ఉక్కు, స్టీల్, బియ్యం వంటివి ఉన్నాయి.



# మే నెల యూపీఐ లావాదేవీల్లో సరికొత్త రికార్డు

**దిల్లీ:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీల్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది మే నెలలో రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. సంఖ్యా పరంగా 2,320 కోట్ల లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వేసవి ప్రయాణాలకు ఐపీఎల్ సీజన్ తోడవ్వడం యూపీఐ లావాదేవీలు పెరగడానికి కారణమయ్యాయి.ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.29.03 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరగ్గా.. గతేడాది మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగాయి. ఏడాదిలో 19 శాతం వృద్ధి నమోదైందని ఎన్‌పీసీఐ తెలిపింది. గతేడాది ఇదే సమయంలో 1867 కోట్లుగా ఉన్న లావాదేవీల సంఖ్య ఏకంగా 24 శాతం వృద్ధితో 2320 కోట్లకు చేరి సరికొత్త రికార్డు నమోదైందని పేర్కొంది.వేసవి సెలవుల్లో ప్రయాణాలు, ఐపీఎల్ ఫీవర్, సీజన్ పరంగా జరిగే లావాదేవీల కారణంగా ఈ స్థాయిలో యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయని క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆకాశ్ సిన్హా పేర్కొన్నారు. ఇది నెలవారీ యూపీఐ లావాదేవీల వృద్ధిని సూచిస్తోందని తెలిపారు. 2021లో యూపీఐ సగటు లావాదేవీ మొత్తం రూ.1848గా ఉండగా.. 2025 నాటికి రూ.1313కు తగ్గినట్లు ఆర్‌బీఐ నివేదిక ఇటీవల వెల్లడించింది. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు



# ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# టెట్ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదల

## జూన్ 16 నుంచి జూన్ 22 వరకు పరీక్షలు


**హైదరాబాద్(జనంసాక్షి):**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష -2026 షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 16 నుంచి జూన్ 22 వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ 2 గంటల నుంచి 4:30 గంటల వరకు ఉంటుంది. పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. పేపర్-1, పేపర్-2 పరీక్షల తేదీలతో పాటు ఉత్తీర్ణత ప్రమాణాలను కూడా అధికారులు వెల్లడించారు. దీంతో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రణాళికలను మరింత మెరుగ్గా రూపొందించుకునే అవకాశం లభించింది. టీఎస్ టెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించాలి.బీసీ అభ్యర్థులు 50 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధిస్తే అర్హత పొందుతారు.

# క్రెడిట్ స్కోరు బాగున్నా.. రుణాలు తిరస్కరిస్తారెందుకు?

**న్యూఢిల్లీ:**క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉన్నవారికి వ్యక్తిగత రుణాలు త్వరగా లభిస్తాయని చాలా మంది భావిస్తుంటారు. అయితే, బ్యాంకుల వద్ద వ్యక్తిగత రుణం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు, రుణం లభిస్తుందా లేదా అనేది కేవలం మీ క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుందని భావిస్తే, మీరు బహుశా పొరబడినట్లే. రుణ తిరస్కరణకు క్రెడిట్ స్కోరే కాకుండా.. ఇతర కారణాలు కూడా ఉంటాయి. ఎందుకంటే, బ్యాంకుకు చెందిన క్రెడిట్ విభాగం స్కోరుతో పాటు అనేక ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది.

**వయసు:**కొన్నిసార్లు, రుణం తిరస్కరణకు వయసు కూడా ఒక కారణం కావొచ్చు. సాధారణంగా, వయసుకు సంబంధించి పెద్దవారితో పోలిస్తే, ఉద్యోగ పదవీ కాలం ఎక్కువ ఉన్న యువకులకు/మధ్యస్థ వయసు వారికి రుణం పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు మీరు మరో రెండేళ్లలో పదవీ విరమణ చెందుతారని బ్యాంకు గ్రహించినప్పుడు, మీకు స్వల్పకాలానికి మాత్రమే మెరుగైన ఆదాయం ఉంటుందని బ్యాంకు భావిస్తుంది. తర్వాత కాలంపై బ్యాంకులకు అనేక సందేహాలుంటాయి. కాబట్టి, బ్యాంకు తక్కువ సర్వీస్ ఉన్న వారికి రుణం ఇవ్వడానికి ఆసక్తి చూపవు. అంతేకాకుండా, పదవీ విరమణకు ముందు ఉండే వయసును బ్యాంకులు రిస్క్ ఏజ్‌గా కూడా పరిగణిస్తాయి. దురదృష్టవశాత్తు ఉద్యోగికి ఏమయినా అయితే, రుణ రికవరీ కష్టం అవుతుంది. అందువల్ల, బ్యాంకులు రుణం ఇచ్చేటప్పుడు ఎక్కువ జాబ్ సర్వీసు ఉన్నవారిపై మొగ్గు చూపిస్తాయి.




**స్థిరమైన ఆదాయం:**రుణ తిరస్కరణకు మరో కారణం స్థిరమైన ఆదాయం లేకపోవడం కూడా. స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు క్రెడిట్ స్కోరు బాగుండి, వ్యక్తిగత రుణ దరఖాస్తుకు అర్హులైనప్పటికీ, వారి ఆదాయం స్థిరంగా ఉండకపోవచ్చు. ఇంకా, బ్యాంకులో అందుబాటులో ఉన్న కొద్దిపాటి మూలధనం కోసం చాలా మంది రుణ దరఖాస్తుదారులు పోటీ పడుతున్నప్పుడు, బ్యాంకులు స్థిరమైన ఉద్యోగం/ఆదాయం లేని వారికి రుణాలు ఇవ్వడానికి సందేహిస్తాయి.

మరికొన్నిసార్లు దరఖాస్తుదారుడికి స్థిరమైన ఉద్యోగం ఉన్నాసరే అతడి నెల ఆదాయం.. రుణ ఈఎంఐకి సమానంగానో లేదా మించో ఉన్నప్పుడు కూడా బ్యాంకులు రుణ దరఖాస్తును తిరస్కరిస్తాయి. బ్యాంకు నిర్దేశించిన కనీస ఆదాయ అర్హత కంటే మీ ఆదాయం తక్కువగా ఉంటే, రుణ సంస్థ రుణ అభ్యర్థనను తిరస్కరిస్తుంది. ఉదాహరణకు, చాలా బ్యాంకులు రుణ దరఖాస్తుదారుడి నెల నికర ఆదాయం రూ.25,000 కంటే ఎక్కువగా ఉంటే మేలని భావిస్తాయి. ఉద్యోగి ఔట్ సోర్సింగ్‌కు చెందినవారయినా కూడా బ్యాంకులు రుణం ఇవ్వడానికి వెనుకాడే అవకాశముంది. ఎందుకంటే, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సర్వీస్ ఎంత కాలం ఉంటుందో బ్యాంకులు సరిగ్గా అంచనా వేయలేవు.

**డాక్యుమెంట్స్:**

రుణ దరఖాస్తుకు సపోర్టుగా దరఖాస్తుదారుడికి చెందిన సంబంధిత పత్రాలు కూడా చాలా అవసరం. ముఖ్యంగా, రుణానికి.. జీతం పే స్లిప్‌లతో పాటు, బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు, గుర్తింపు రుజువు వంటివి అవసరం పడతాయి. డాక్యుమెంట్ల పరిశీలన, ధ్రువీకరణ తర్వాత మాత్రమే వ్యక్తిగత రుణ దరఖాస్తు ఆమోదం జరుగుతుంది. అయితే, ఏదైనా వ్యక్తిగత డాక్యుమెంట్ లేకపోయినా లేదా వాటిలో తప్పులున్నా, పత్రాలలో పొంతన లేని సమాచారం ఉన్నా, మీ రుణ దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది.

# మరణంలోనూ వీడని బంధం



**ముస్తాబాద్ జూన్ 01 (జనంసాక్షి) :** బంధాలు, అనుబంధాలు ఇప్పుడున్న సమాజంలో మంటగలుస్తున్న వేళ. ప్రేమ, ఆప్యాయతనురాగాలు, తోడు నీడకు తావు లేదనుకున్న సమయాన. సమాజంలో ఏదైనా ఒకే ఒక్క సంఘటన అప్పుడప్పుడు మనుషుల్ని కలవరపెడుతుంది. భార్యాభర్తల బంధం లో ఒకరి మరణం అన్ని బాధలకు ముగింపే కావచ్చు. కానీ ఒకరి వీడ్కోలు మరొకరి జీవితంలో అసంపూర్ణంగా మిగిలిపోతుందన్న ఆలోచనే అతనికి తోడుగా ఆమె కూడా వెళ్ళిపోయింది. రెండు చావులు ఒకే వేదికలా ఆ భార్యాభర్తలు కాడును సైతం పంచుకున్న సంఘటన ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో చోటుచేసుకుంది. తెర్లుమద్ది గ్రామానికి చెందిన నిరుపేద కూలి మామిడాల ముత్తయ్య(70) భార్య మల్లవ్వ, గ్రామంలో అన్యోన్యంగా కలిసి ఉంటూ ఒకరినొకరు వీడని బంధంగా ఆ గ్రామంలో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. కాగా మామిడాల ముత్తయ్య నిన్నటి రోజు అనారోగ్యంతో రాత్రి పది గంటలకు మృతి చెందాడు. భర్త మృతిని తట్టుకోలేక భార్య మల్లవ్వ సోమవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగానే భర్త శవం పక్కనే కూర్చుని అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయింది. దీంతో తెర్లు మద్ది గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వారి మరణం గ్రామస్తుల్ని కలచివేసింది. మల్లయ్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు, అత్యంత నిరుపేద కుటుంబమని, ఒక కొడుకు ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు అయ్యాయని, చిన్న కొడుకు ఇంకా పెళ్లికి ఉన్నాడని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటివరకు కూడా సొంత ఇల్లు లేదని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ బైతి దుర్గవ్వ నవీన్, మామిండ్ల శ్రీకాంత్ గ్రామస్తులు కోరారు.

# రేపు ఉత్తరాఖండ్‌కు కరీంనగర్ మేయర్ పయనం

### 3, 4 తేదీల్లో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశాలు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 01 (జనంసాక్షి) :** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాల్లో గౌరవ అతిథిగా పాల్గొనాల్సిందిగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ఋషికేష్ నగరపాలక సంస్థ ఆహ్వానం పలికింది. ఈ మేరకు సోమవారం రోజున ఋషికేష్ నగరపాలక సంస్థ నుండి మేయర్ కోలగాని శ్రీనివాస్ కు ఆహ్వాన పత్రికను పంపించారు. జూన్ 3, 4 తేదీల్లో ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్య మంత్రి పుష్కర్ సింగ్ ధామి తో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు, రాజ్యసభ, లోక్ సభ సభ్యులు హాజరుకానున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ కార్యదర్శి , ఆహ్వాన కర్త మనోజ్ గుప్తా, సహా ఆహ్వాన కర్త, ఋషి కేష్ నగరపాలక సంస్థ మేయర్ రణజాయ్ పొన్వర్ ల ఆహ్వానం మేరకు మేయర్ కోలగాని శ్రీనివాస్ సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రధానంగా ఈ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల మేయర్లు పాల్గొని పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, స్మార్ట్ సిటీ కార్యక్రమాలు తదితర అంశాల పై చర్చించనున్నారు.

# సింగరేణి వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన

**గోదావరిఖని (జనంసాక్షి) :** సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించకుండా కార్మికుల ఆరోగ్య సమస్యల ను పెండింగ్‌లో ఉంచుతూ వారి జీవితాలతో యాజమాన్యం చెలగాట మాడుతోందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జూన్ 3న సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని గనులు, ఏరియాలు, విభాగాల్లో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తూ నిరసన తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. మెడికల్ బోర్డు సమావేశాలు సకాలంలో నిర్వహించకపోవడం వల్ల అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది కార్మికుల కేసులు పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్య సమస్యల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులను త్వరితగతిన పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మరింత తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

### ఇసుక దందాలో డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే

# పదవికి రాజీనామా చేస్తా



- అకాల వర్షాలకు నష్టపోయిన వారికి పరిహారం..
- తడిసిన ధాన్యం, మక్కజొన్నలు కొనుగోలు చేస్తాం..
- రాష్ట్ర సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

ధర్మారం జగిత్యాల జిల్లా జూన్ 01(జనం సాక్షి): ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో కురిసిన ఆకాల వర్షాలకు జరిగిన నష్టాన్ని మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై ఏలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వకాలంలో జోరుగా ఇసుక దందాసాగిందని, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరేళ్ల గ్రామం నుంచి మానేరు ఇసుకను రోజు వందల లారీల్లో రవాణ చేసే వారని మంత్రి అన్నారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న క్రమంలో పలువురు లారీల కింద పడి మరణించారని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. నేరేళ్ల దళితులు అక్రమ ఇసుక రవాణపై అందోళన చేస్తే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులపై థర్డ డిగ్రీ ఉపయోగించిందని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో దళితులపై జరిగిన దాడులపై మాట్లాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక దందాలో తనకు వాట ఉందని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేయడానికి సిద్దమని మంత్రి అడ్లూరి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మంత్రి అడ్లూరి హితవు పిలికారు.

### తడిసినవడ్లు, మక్క జొన్నలు కొనుగోలు చేస్తాం..

ధర్మారం మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, మక్కజొన్నలు కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి అన్నారు. రైతులు ఎవ్వరు అందోళన చెందవద్దని మంత్రి కోరారు. ఆకాల వర్షానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా అదుకుంటామని మంత్రి అడ్లూరి తెలిపారు.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోం

- కేటీఆర్ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (జనంసాక్షి) :** వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం లేదనీ కావాలని కేటీఆర్, హరీష్ రావు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కొనరావుపేట మండలం గొల్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ బండ గణేష్ పలువురితో కలిసి వేములవాడ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ పాలనకు ఆకర్షితులై ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలకు ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత జరిగిన సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు, ఎంపీ ఎన్నికలు సహా పలు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఆశీర్వాదాలు అందించార న్నారు. గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయల వడ్డీ భారం ఉన్నప్పటికీ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నా మన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఏ ప్రాజెక్టులోనూ నాణ్యత లోపించలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నాణ్యతపై అనేక విమర్శలువచ్చాయన్నారు. ఆది వారి హయాంలోనే కూలిపోయి కుళేశ్వరం అయ్యిందన్నారు. కేటీఆర్ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా వ్యవసాయనికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వ్యవసాయనికి మూడు గంటల విద్యుత్ చాలని ముఖ్యమంత్రి ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అయన విమర్శించారు. 24 గంటల ఉచిత విద్యుత్ అందించడం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతగా కేటీఆర్ చెప్పుకోవడం సరికాదని, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలోనే ఉచిత విద్యుత్ పథకం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించిన ఉచిత విద్యుత్ పథకాన్నే కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించిందనిన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి 12 గంటలకు మించి విద్యుత్ అందిన సందర్భాలు లేవని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అంతరాయాలు లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో ఏ ఒక్క సబ్‌స్టేషన్ వద్ద కూడ రైతులు విద్యుత్ సమస్యలపై ధర్నాలు చేసిన ఘటనలు కనిపించలేదన్నారు. ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తామని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ముఖ్యమంత్రి పలుమార్లు స్పష్టంగా ప్రకటించారని అయన గుర్తు చేశారు. మోటార్లకు మీటర్లు పెడితే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమని సీఎం సవాల్ విసిరారని,అయితే ఒకవేళ మీటర్లు పెట్టకపోతే బీఆర్‌ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా అనే ప్రశ్నకు కేటీఆర్ సమాధానం చెప్పడం లేదన్నారు. రైతు డిస్కం ఏర్పాటు అంశంపై కూడా కేటీఆర్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దెబ్బతీసిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పలువురు ముఖ్యమంత్రులు చేయని స్థాయిలో అప్పులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో చేశారని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారని, బీఆర్‌ఎస్, బీజేపీ పరిమిత స్థాయిలోనే నిలిచాయన్నారు. పేద ప్రజల చిరకాల స్వప్నమైన సొంతింటిని నెరవేర్చేందుకు ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని,రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. సంరక్షించాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పర్యావరణ ఉత్సవాలు
- మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 01 (జనం సాక్షి) :** వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 1 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు పర్యావరణ ఉత్సవాలలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు మామిడి మొక్కలు నాటి నీటిని పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ ఉత్సవాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026 ఫలితాల్లో

# 'అల్ఫోర్స్' అఖండ విజయం




- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, జూన్ 01 (జనంసాక్షి) :** సోమవారం రోజు ప్రకటించబడిన ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్-2026 ఫలితాలలో మా అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాదించారని ఆల్ఫోర్స్ అధినేత వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఐఐటి - జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో మా విద్యార్థులు కె. ప్రజ్ఞాన్ దీపక్ 75 వ ర్యాంకు సాధించగా, సి. హెచ్. లక్ష్మీహాసిని 400, ఎన్. రత్నప్రకాశ్ 497, బి. లిఖిత్ సాయి 785, ఎమ్. వశిష్ఠ 800, బి. స్పందన 954, కె. ధనుష్ 1294, ఎమ్. జోహన్ 1400, పటేల్ అక్షయ 1488, సి.హెచ్. అభిరామ్ రావు 1618, ఎ. సత్యవర్ధన్ 1678 ర్యాంకులు సాధించి "అల్ఫోర్స్" ఖ్యాతిని మరింత పెంచారని ఈ సందర్భంగా తెలిపారు. 1,000 లోపు 6 మంది విద్యార్థులు, 2,000 లోపు 11 మంది విద్యార్థులు, 3,000 లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడము విశేషం అన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిషలు కృషి ఇంతటి ఘనవిజయానికి తోడ్పడ్డాయని, ఎప్సెట్-2026లో మా అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించారన్నారు. కరీంనగర్ జిల్లాలో ప్రప్రథమంగా ఐ.ఐ.టి. కోచింగ్ అంధించి అనేక మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐ.ఐ.టి.లలో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దిన మొదటి, ఏకైక విద్యాసంస్థ అల్ఫోర్స్ అని ఈ సంధర్భంగా తెలియజేయుచున్నానని, ప్రతీ సంవత్సరం అల్ఫోర్స్ అందించిన అద్భుతమైన ఐ.ఐ.టి కోచింగ్ ద్వారా ఐ.ఐ.టిలలో సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగడం విశేషం. రాబోయే నీట్ - 2026 ఫలితాలలో మా అల్ఫోర్స్ చిన్నారులు అద్భుత ర్యాంకులు సాధిస్తారని విశ్వసిస్తున్నాని తెలిపారు. ఐఐటి - 2026 ఫలితాలలో అద్భుత ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ అణిముత్యాలను, వారి తల్లిదండ్రులను మన: స్ఫూర్తిగా అభినందిస్తున్నానని, ఇంతటి ఘనవిజయానికి తోడ్పడిన మా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.




### దశాబ్దకాలంగా పరారీలో ఉన్న

# మోస్ట్ వాంటెడ్ నేరస్తుడు ధూమ్ ఖలీద్ అరెస్ట్

- అరెస్టు చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు



**కరీంనగర్ రూరల్, జూన్ 1 ( జనం సాక్షి) :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు మహ్మద్ అబ్దుల్ వాజిద్ అలియాస్ ఖాలీద్ అలియాస్ ధూమ్ ఖాలీద్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. పోలీసుల వివరాల ప్రకారం, ధూమ్ ఖాలీద్‌పై కరీంనగర్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో చైన్ స్నాచింగ్, దారి దోపిడీలు, గ్యాంగ్ రేప్ తదితర తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం చేసిన కేసులో గతంలో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అనంతరం అతడు పరారయ్యాడు. అప్పటి నుంచి మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, చంద్రపూర్, బల్లార్ష తదితర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం ఘటన అనంతరం గుర్తుతెలియని వ్యక్తులు అతనిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్సలో భాగంగా అతని రెండు కాళ్లను తొలగించాల్సి వచ్చింది. అయినప్పటికీ నేరప్రవృత్తిని కొనసాగిస్తూ మహారాష్ట్రలో వివిధ ప్రాంతాల్లో ముఠాలను ఏర్పాటు చేసుకుని నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. దర్గాల వద్ద బిక్షగాడి వేషంలో ఆశ్రయం పొందుతూ వాహనాల ద్వారా సంచరిస్తూ నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఐదు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసుతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కూడా అతనిపై కేసులు నమోదై ఉన్నాయి. అనేక ఘటనల్లో బాధితులు ఫిర్యాదులు ఇవ్వకపోవడంతో అతడు పాల్పడిన కొన్ని నేరాలు అధికారికంగా నమోదు కాలేదని సమాచారం. ఇటీవలి కాలంలో హైదరాబాద్ సమీపంలోని మేడిపల్లి ప్రాంతంలో నివసిస్తున్న తన భార్యను హత్య చేసేందుకు ధూమ్ ఖాలీద్ ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ప్రణాళికలో భాగంగానే కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతని కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సోమవారం కరీంనగర్‌కు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. అనంతరం అత్యాచారం కేసులో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అతనిపై ఉన్న ఇతర కేసుల్లో కూడా తదుపరి చర్యలు చేపట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న ఘరానా నేరస్థుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో కరీంనగర్ రూరల్ పోలీసులు చూపిన చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ కూడా ప్రత్యేక టాస్క్ ద్వారా ఈ అరెస్ట్ సాధించడం అభినందనీయమన్నారు. ఈ అరెస్ట్‌పై కరీంనగర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు తీవ్రమైన నేరాలకు పాల్పడిన నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మహావీర్ ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారుల మృతి

- ప్రజావాణిలో ప్రజా సంఘాల ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల చనిపోయినట్లు తల్లిదండ్రుల ఆందోళన
- ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి
- జరిగిన సంఘటనపై విచారణ జరుగుతున్నట్లు పట్టణ సీఐ రఘు కుమార్







**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 1 (జనం సాక్షి) :** జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పట్టణంలోని మహావీర్ ఆస్పత్రిలో సోమవారం జరిగింది. మహావీర్ ఆసుపత్రిలో నవాబ్ పేట్ మండలం మీనేపల్లి. చించల్ పేట గ్రామాలకు చెందిన ఇద్దరు చిన్నారులు తీవ్ర జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం మహావీర్ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్ భక్తవత్సలం ఇద్దరు చిన్నారులకు చికిత్స అందించారు. సోమవారం తెల్లవారుజామున వారి పరిస్థితి విషమించడంతో డాక్టర్ భక్తవత్సలం కు జూనియర్ డాక్టర్లు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన ఫోన్ ద్వారా జూనియర్ డాక్టర్లకు సూచనలు చేస్తూ చికిత్స అందించడంతో ఇద్దరు చిన్నారులు తెల్లవారుజామున మృతి చెందారు. ఈ సంఘటనతో మహావీర్ ఆసుపత్రిలో తీవ్ర ఉద్రుక్త పరిస్థితి నెలకొంది. డాక్టర్ భక్తవత్సలం అశ్రద్ధ నిర్లక్ష్యం కారణంగా తమ ఐదు నెలల పాప మృతి చెందిందని ఆమె తల్లిదండ్రులు జోగు మధుకర్ మౌనిక ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగానే తమ పాప కలర్ మారుతుందని మరోసారి తమ పాపను పరీక్షించాలని డాక్టర్లను సంప్రదించిన వారు సరైన సమయంలో సరైన చికిత్స అందించని కారణంగా మృతి చెందినట్లు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల తమ పాప మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వికారాబాద్ పట్టణ సీఐ రఘుకుమార్ జరిగిన సంఘటనపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇదే విషయమై సిపిఎం జిల్లా కార్యదర్శి మైపాల్ తో పాటు వివిధ ప్రజా సంఘాలు ప్రజావాణి కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి విచారణకు ఆదేశించారు. ఈ సంఘటనపై వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ల బృందం విచారణ జరిపారు. ఒకే రోజు మహావీర్ ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారని ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేమని నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని అన్నారు. ఇదే విషయమై సిపిఎం ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ పార్టీల నాయకులు మైపాల్ గీత మహేందర్లు వివిధ అనుబంధ సంస్థల నాయకులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు . ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైన డాక్టర్ భక్తవత్సలం తో పాటు మరో ముగ్గురు జూనియర్ డాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారులు మృతి చెంది తల్లిదండ్రులు రోదిస్తుంటే వారికి నచ్చ చెప్పేది పోయి మహావీర్ ఆస్పత్రి డాక్టర్లు దురుసుగా ప్రవర్తించారని వారు ఆరోపించారు. అంతేకాకుండా మృతి చెందిన పాప తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. డాక్టర్లపై చిన్నారుల తల్లిదండ్రులు దాడి చేయకున్నా తమపై దాడి చేసినట్లు తప్పుడు ఫిర్యాదు పోలీసులకు చేశారని ఆరోపించారు. డాక్టర్లు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఫిర్యాదు చేశారని అన్నారు. మహావీర్ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చి రోగులు మృత్యువాత పడడం సర్వసాధనమైపోయిందని ఆసుపత్రి పై మెడికల్ కౌన్సిల్ సమగ్ర దర్యాప్తు జరపవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్లవి సరైన పట్టాల లేక నకిలీ సర్టిఫికెట్ల పై డాక్టర్లుగా చలామణి అవుతున్నారా అనే సందేహం కలుగుతుందని అన్నారు. ఆసుపత్రిలో అనేక లోగులుసులు ఉన్నాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి మెడికల్ లైసెన్స్‌ను రద్దు చేయవలసిన ఆవశ్యకత ఉందని తెలియ చేశారు.

## కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి




**నిజాంపేట్, జూన్ 1 (జనం సాక్షి) :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26000/-జీతం ఇవ్వాలని నిజాంపేట్ సర్కిల్ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావానిలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రధాని నుండి తొలి తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి వరకు అందరు పారిశుధ్య కార్మికుల కాళ్లు కడుగుతామన్న వారే, వారి సమస్య పరిస్కారం ఇస్తామని కోసం అనేక వాగ్దానాలు చేశారు. అని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రభుత్వం ముందు అనేక డిమాండ్లు పెట్టారుఅని అన్నారు. అందులో రెండవ పిఆర్సి కనీస వేతనాలు 26,000/- రూపాయలు ఇవ్వాలని నిర్ణహించాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానని అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వారు అన్నారు. అందరికి ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలనీ, అలాగే పండగ సెలవులు, వారాంతపు సెలవులు కూడిన సెలవలు మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, జీ. శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

- టౌన్ ప్లానింగ్ ఏసీపీకి బీజేపీ నేతల వినతి



**ఉప్పల్, జూన్ 1 (జనం సాక్షి) :** ఉప్పల్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ డివిజన్ బీజేపీ నాయకులు టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ డివిజన్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న అక్రమ కట్టడాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉప్పల్ బాగాయత్, భారత్‌నగర్, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమ షెడ్లు నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతుండటంతో భవిష్యత్తులో అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, వర్కల రాజేందర్ గౌడ్, బోరంపేట మురళీకృష్ణ ముదిరాజ్, సింగారం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి సొంత కళ ప్రభుత్వ లక్ష్యం



**మొయినాబాద్, జూన్ 1 (జనంసాక్షి) :** ప్రతి కుటుంబానికి పేదింటి సొంతింటి కళ నెరవేర్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్రెడ్డి సర్కార్ కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో సర్పంచ్ మద్యపాగ కృష్ణ ఆధ్వర్యంలో మొదటి విడతలో లబ్ధిదారులు నిర్మించుకున్న పూర్తైన నాలుగు ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఇళ్ల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నాయకులతో కలిసి ప్రారంభించి ఇందిరమ్మ ఇండ్లల్లో ఏర్పాటు చేసిన భోజనాన్ని తిన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్లను ప్రారంభించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలు సొంతింటి కళ నెరవేరుతుంద న్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జోరుగా సాగుతుందని తెలిపారు. పేదలకు సొంత స్థలం ఉంటే అర్హులైన లబ్ధిదారులందరికి ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆ నిధులు నాలుగు విడతలుగా పేదల ఖాతాలోనే జమ చేయడం జరుగుతుందన్నారు. దీనికి దళారులు ఎవరు పనికి రారని తెలిపారు. అమ్డాపూర్‌లో నిర్మించుకున్న ఇండ్లు ఇందిరమ్మ ఇండ్లు లగ్జరీలాగా నిర్మించుకోవడం వారిని అభినందిస్తు సన్మానించారు. ఇంకా సమస్యలు ఉంటే గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యాలయంలో తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. అమ్డాపూర్ వికలాంగుడు రత్నయ్య ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడం ఆయన కుటుంబ సభ్యులను సన్మానిస్తు అభినందిస్తు ప్రభుత్వం ద్వారా వికలాంగుడికి వీల్ చైర్ ఇప్పించేందుకు కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి బిరుదు హిమబిందుకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, అమ్డాపూర్ సర్పంచ్ మధ్యపాగ కృష్ణ, కాశింబౌలి సర్పంచ్ మాడి రాజేందర్రెడ్డి, ఉపసర్పంచ్ జితేందర్రెడ్డి, రామ్మోహన్ రెడ్డి అభివృద్ధి అధికారి బిరుదు హిమబిందు, ఎంపీవో వెంకటేశ్వర్రెడ్డి, నాయకులు మన్నె ప్రభాకర్రెడ్డి, గుంటం సైపాల్రెడ్డి, మాజీ ఎంపీటీసీల బాత్కు అంతయ్య, పట్నం రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, అమ్డాపూర్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావం రోజే అపాయింట్మెంట్ డేట్ ప్రకటించాలి

- ముందుగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్
- ఇందిరా పార్కు వద్ద టీజేఎంయు మహా దీక్ష



**ముషీరాబాద్ జూన్ 1 (జనం సాక్షి) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 02 నే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయు అపాయింట్మెంట్ డేట్ గా ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్మ చౌక్ వద్ద తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మహాదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ మే ఒకటిన ముఖ్యమంత్రి అన్ని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులతో సమావేశంలో మీకు ముందుగ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలా?, లేక యూనియన్ ఎన్నికలు నిర్వహించాలా..? ఏది కావాలో ఆ నిర్ణయాన్ని ఎండి కి తెలియజేయమని చెప్పిన పిదప, అన్ని యూనియన్లు విలీనం చేయాలని రాతపూర్వకంగా తెలియజేశారన్నారు. కానీ రవాణా శాఖ మంత్రి అట్టి విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ముందుగా ఎన్నికలు నిర్వహిస్తానని చెప్పడంతో ఆర్టీసీ ఉద్యోగులు అయోమయానికి గురయ్యారని చెప్పారు. రవాణా శాఖ మంత్రి ఈ విషయాన్ని పున పరిశీలించి ముందుగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని దానికి సంబంధించిన అపాయింటెడ్ డేట్‌ని ఇవ్వాలని కోరారు. లేనిచో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆమరణ నిరాహార దీక్ష చేపడుతుందని తెలిపారు. దీక్షకు ఆర్టీసీ సమాఖ్య నాయకులు రాజి రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడుతూ జూన్ 2వ తేదీన వీలిన ప్రకటన చేయకుంటే తదుపరి కార్యాచరణ చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనయ్య,గోలి రవీందర్,రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ప్రేమ్ నాథ్, రాష్ట్ర కార్యదర్శులు జీవన్, రామ్,నరేందర్, సంపత్ కుమార్, అతిక్, గ్రేటర్ హైదరాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కృష్ణ, సిటీ రీజినల్ సెక్రెటరీ బుల్లెట్ పాండు,సికింద్రాబాద్ రీజినల్ సెక్రెటరీ చెన్నయ్య, సమాఖ్య నాయకులు సాయి రెడ్డి, జకరయ్య, మహబూబ్నగర్ రీజినల్ సెక్రెటరీ నాగేంద్ర గౌడ్, వివిధ డిపో అధ్యక్ష కార్యదర్శులు నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.32 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం






**బోడుప్పల్, జూన్ 1 (జనంసాక్షి) :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలో రోడ్డు సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుందని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు.సోమవారం బోడుప్పల్‌లో అకాడమిక్ హైట్ స్కూల్ వద్ద గల మెడిప్లస్ నుంచి అమృత బార్ సమీపంలోని మెడిప్లస్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కార్పొరేటర్లతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.32 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని,నగర అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. బోడుప్పల్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమిష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హరినాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,కొత్త చందర్ గౌడ్,సింగిరెడ్డి పద్మారెడ్డి,కొత్త దుర్గమ్మ, చీరాల నరసింహ,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్,సీసా వెంకటేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్రి శివశంకర్,అసర్ల బీరప్ప,జెన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీ ఆశ చూపి.. పరారైన చిట్టీల వ్యాపారి

- జిల్లా పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- రూ.10 కోట్ల మేర ఉడాయించిన నిర్వాహకుడు

**మల్దకల్, జూన్ 1 (జనంసాక్షి) :** జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో అధిక వడ్డీ ఆశ చూపి..రూ.10 కోట్ల ఘరాన మోసం చేసిన ఓ చిట్టీల నిర్వాహకుడు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన తంబలి కృష్ణయ్య అనే వ్యక్తి గత కొంతకాలంగా చిట్టీలు కట్టించుకుంటూ నమ్మకంగా ఉన్నాడు.అనుకున్న సమయానికి సొమ్ము తిరిగి చెల్లిస్తాడనే గుర్తింపు రావడంతో అతడిపై జనాలకు నమ్మకం ఏర్పడింది.దీంతో పెద్దసంఖ్యలోనే అతడి వద్ద చిట్టీలు వేసేవారు. ఈక్రమంలో అతని చిట్టీల వ్యాపారం మల్దకల్,ధరూర్, అల్లపాడు,పాతపాలెం, కొత్తపాలెం,కోతులగిద్దె,ఐజ మండలాలతో పాటు,గద్వాల పట్టణానికి విస్తరించింది.ఈ క్రమంలో చిట్టీల వ్యాపారంతో పాటు తనకు పరిచయం ఉన్న వారు సన్నిహితులతో పెద్ద మొత్తంలో వడ్డీలు తీసుకున్నాడు.మొదట్లో తాను ప్రజల నుంచి తీసుకున్న నగదుకు వడ్డీతో సహా సక్రమంగా చెల్లించడంతో నమ్మకం ఏర్పడి సుమారు పదుల సంఖ్యలో బాధితులు ఒకరికి తెలియకుండా ఒకరు అతడికి అప్పు ఇచ్చారు.ఇలా రూ.10 కోట్లకు పైగా వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.గృహిణులు చిన్న చిన్న వ్యాపారులు ఈ చీటీలలో పెట్టుబడి పెట్టి ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.నమ్మకమైన వ్యాపారంగాముద్ర వేసుకున్న సదరు వ్యక్తి పట్టణంలోని మధ్యతరగతి కుటుంబాలను లక్ష్యంగా చేసుకొని ఈ చిట్టిల వ్యాపారంతో పాటు అధిక వడ్డీ వ్యాపారము కొనసాగిస్తున్నాడు.గత వారం రోజుల నుంచి చిట్టీల నిర్వాహకుడు గ్రామం వదిలి వెళ్లినట్టుగా తెలియడంతో పోలీసులను ఆశ్రయించే ప్రయత్నంలో బాధితులు ఉన్నారు.కాగా సోమవారం బాధితులు జిల్లా ఎస్పీని ఆశ్రయించి,ఫిర్యాదు చేశారు.

## వీవోఏల డిమాండ్లను నెరవేర్చాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, జూన్ 1 (జనంసాక్షి) :** వీవోఏల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వీవోఏలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు.ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలన్నారు.గౌరవ వేతనం నెలకు 20 వేలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పాండు యాదవ్,వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్,మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, నాయకులు అంబయ్య యాదవ్,కర్రోల్ల చంద్రయ్య ముదిరాజు,చిలుకమర్రి నర్సింహ,సమీర్,పీఏసీఎస్ డైరక్టర్లు కాడమోని ప్రభాకర్,బాలయ్య,కటికల మహేందర్,దుద్దు కృష్ణ యాదవ్,మిద్దింటి సురేష్,శ్రీశైలం యాదవ్ పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అధికారుల తీరుపై మాజీ కార్పొరేటర్ ఆగ్రహం

- ప్రజావాణిలో ఖాళీ కుర్చీలు
- టౌన్ ప్లానింగ్‌పై విజిలెన్స్ విచారణ జరిపించాలి
- వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ



**మల్కాజిగిరి, జూన్ 1 (జనంసాక్షి) :** మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదంటూ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో నాయకులు జోనల్ కార్యాలయంలో జరిగే ప్రజావాణికి వచ్చారు. అక్కడ జోనల్ కమిషనర్‌తో పాటు హార్టికల్చర్, శానిటేషన్, ఇంజనీరింగ్, స్పోర్ట్స్ విభాగాల అధికారులు ఎవరూ లేకపోవడం, కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమివ్వడంతో పరిస్థితి ఒక్కసారిగా మారింది.పారిశుధ్యం, వీధిదీపాలు, రోడ్ల గుంతల పూడ్చివేత ఎక్కడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రవణ్ తన లెటర్ ప్యాడ్‌ను జోనల్ కమిషనర్ కుర్చీకి అతికించి అక్కడే బైఠాయించారు.అధికారులు రావాలంటే ఇక్కడ హోమం చేసి, మంత్రాలతో ఆవాహన చేయాలా అంటూ డిప్యూటీ కమిషనర్ జాకీ య సుల్తానాను నిలదీశారు. దీంతో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. వర్షాలు పడే సమయం వస్తున్నా నాలాల పూడికతీత పనులు చేపట్టకపోవడంపై మండిపడ్డారు. ఆనంద్‌బాగ్, సఫిల్‌గూడ, ఉత్తమ్‌నగర్‌లలో రోడ్లను తవ్వేసి వదిలేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.టౌన్ ప్లానింగ్ అధికారులు ఒకే ప్లాట్‌లో సగానికి పర్మిషన్ ఇచ్చి, మిగతా సగం యూఎల్సీ లో ఉందంటూ దరఖాస్తుదారులను సతాయిస్తున్నారని, దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సఫిల్‌గూడ చెరువులో గుర్రపుడెక్క తొలగించాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. అలాగే వేసవి ముగుస్తున్నా క్రీడా సాగ్రగి ఇవ్వకుండా సమ్మర్ క్యాంపులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. స్ట్రీట్ లైట్ సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.సమస్యలపై ఖచ్చితమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని బైఠాయించారు. వారం రోజుల్లోగా అన్ని సమస్యలపై స్పష్టమైన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో మురళి గౌడ్, మాధవ్ యాదవ్, సత్తిరెడ్డి శ్యామ్, వాణిశ్రీ, నందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీ వేణుగోపాల్‌ను కలిసిన డిప్యూటీ సీఎం భట్టి

**ఢిల్లీ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలో పర్యటించిన భట్టి విక్రమార్క.. అక్కడ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తో, స్థానిక కాంగ్రెస్ నాయకులతో జరిపిన చర్చలు, పార్టీ వ్యవహారాలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ కి అందజేశారు.










## మియాపూర్ పిఎస్ పరిధిలో 18 కేజీల గంజాయి పట్టివేత

**శేరిలింగంపల్లి, జూన్ 01 (జనంసాక్షి) :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సోమవారం కూకట్పల్లి డిసిపి రితిరాజ్ ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. మే 30వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద నుండి ఔరంగాబాద్ వెళ్లడానికి కొంతమంది షిరిడి ట్రావెల్ బస్సును ఎక్కడం జరిగింది. ఈ క్రమంలో అనుమానాస్పద మూటలను వారు బస్సులో ఎక్కిస్తుండగా వాటి గురించి కండక్టర్ ప్రశ్నించగా తడబడుతూ అనుమానాస్పద సమాధానాలు ఇవ్వడంతో అతడి అనుమానం మరింత బలపడి మార్గమధ్యంలో ఉన్న మియాపూర్ పోలీస్ స్టేషన్ కు నేరుగా బస్సులు పోనించి అనుమానితులపై మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారు సదరు మూటలను తెరిచి చూడగా దాంట్లో ఏకంగా గంజాయి బయటపడడంతో దానిని తూచగా అది 18 కిలోలుగా తేలింది. బయట మార్కెట్లో సదరు గంజాయి విలువ దాదాపు 20 లక్షలు ఉంటుందని, ఎంతో మనోధైర్యంతో కండక్టర్ వ్యవహరించిన తీరుకు మియాపూర్ పోలీసులు హర్షించి ఇదే విషయాన్ని కూకట్పల్లి డిసిపి రితి రాజుకు తెలియజెప్పడంతో ఆమె ఈరోజు సదరు కండక్టర్ ను ప్రత్యేకంగా అభినందించి సన్మానం తో పాటు కొంత నగదు ప్రోత్సాహకాన్ని సైతం అందించడం జరిగింది. నేరాల అదుపులో సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత ఉంటుందని, నిర్భయంగా ముందుకు వచ్చి అక్కడక్కడ చోటు చేసుకునే సంఘటనలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకొని రావాలని, తద్వారా నేరాలను మొదలైంది చేసే అవకాశం ఉంటుందని డిసిపి వివరించారు. ఈ కేసులో మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు.

# పాలమూరుకు సీఎం

- సీఎం షెడ్యూల్ ఖరారు
- పెండింగ్ ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష
- రాజకీయాలకు పాలమూరు రంగారెడ్డి కేంద్రబిందువుగా మారిందా?



**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి) :** ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టల పరిశీలనకు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారైంది. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి స్థాయిలో పై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 4,5 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించేందుకు సీఎం రేవంత్ రెడ్డి షెడ్యూల్ ఖరారు అయ్యింది. ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్ర యం నుంచి కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి బోస్ రాజు తో కలిసి సీఎం పర్యటించనున్నారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణ, భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజ్ ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా వీక్షించనున్నారు. అనంతరం మక్తల్ లో ఆర్బీఎల్ఐఎస్ లిఫ్ట్ -1 పనులను పరిశీలించనున్నారు. అనంతరం జూరాల ప్రాజెక్ట్‌తో పాటు గూడెందొడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించనున్నారు. సోమశిలలోని హరిత గెస్ట్ హౌస్‌కు చేరుకున్న అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టలపై సమగ్రంగా సమీక్షించనున్నారు. రెండవ రోజు సోమశిలలోని హరిత హోటల్ నుంచి ప్రారంభమై రోడ్డు మార్గాన కొల్లాపూర్ మండలం ఎల్లూరు వద్ద పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 1, 2, 3 ప్యాకేజిలతో పాటు మహాత్మగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను, నార్లాపూర్ జలాశయం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించను న్నారు. హెలికాప్టర్‌లో ఉయ్యాలవాడలో ఇరిగేషన్ ఆఫీస్ కాంప్లెక్స్ చేరుకుని అక్కడ నూతనం ఏర్పాటు చేసిన సముదాయాన్ని ప్రారంభించ నున్నారు. అనంతరం కుమ్మెర గ్రామానికి చేరుకుని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోత పథకంలోని స్టైజ్ 3 పంప్ హౌస్ ను పరిశీలించి ప్రారంభించనున్నారు. రెండవ రోజు పర్యటనలో చివరగా ఉదండపూర్ రిజర్వాయిర్ ను పరిశీలించనున్నారు. అనంతరం అక్కడే మరో సారి సాగునీటి ప్రాజెక్టలపై మరోసారి సమీక్షించనున్నారు. అనంతరం పర్యటన వివరాలను మీడియాతో పంచుకోనున్నారు.

# ఐటీ కారిడార్‌కు వరద ముప్పు తప్పిద్దాం

- 15 రోజులలో సమస్యలు పరిష్కారానికి ప్రణాళికలు
- సీఎంసీ పరిధిలోని అధికారులతో సమీక్షించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్‌కు వరద ము ప్పు తోడవ్వకుండా జాగ్రత్తలు తీసుకుందామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వర్షాకాలంలో రహదారులపై ఏమాత్రం నీరు నిలిచినా తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. వర్షాకాల సన్నద్ధతపై సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలోని సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా కమిషనర్, సీఎంసీ కమిసనర్ సృజన సంయుక్తంగా సోమవారం హైడ్రా కార్యాలయంలో సమీక్షించారు. సీఎంసీ పరిధిలో మొత్తం 202 వాటర్ లాగింగ్ పాయిం ట్లుంటే.. అందులో 83 మేజర్, 95 మీడియం, 24 మైనర్ ప్రాబ్లం ఉన్న ప్రాంతాలుగా గుర్తించారు. 15 రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల ని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే సంబంధిత శాఖల అనుమతుల కోసం లేఖలు రాసామని సరిపుచ్చ వద్దన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వరద కాలువల్లో పూడికను తొలగిం చే పనులకు ప్రథమ ప్రాధాన్యాన్నివ్వాలన్నారు. గాలి వానకు పడిపోయే ప్రమాదమున్న చెట్లను ముందుగానే గుర్తించి గ్రూమిగ్ చేయాలన్నారు. ఎస్ ఎం ఎస్ అలర్ట్స్ ద్వరా భారీ వర్షాల సమాచారాన్నివ్వడమే కాదు.. వరద ముప్పు ఉన్న దారుల గురించి.. ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడం చేయాలని హైడ్రా కమిషనర్ తెలిపారు. అంతకు ముందు మేజర్ వాటర్‌లాగింగ్ పాయింట్లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హైడ్రా అదనపు కమిషనర్ వర్ల పాపయ్య వివరించారు. అలాగే మెట్ టీమ్స్, డీఆర్ ఎఫ్ బృందాల పనితీరును తెలిపారు.








## ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పోలీసింగ్ సేవలు అందించాలి : ఎస్పీస్నేహ మెహ్రా

**ధారూర్, జూన్ 01 (జనంసాక్షి):** ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే లక్ష్యమని వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. సోమవారం ధారూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది విధి నిర్వహణ తీరును పరిశీలించిన ఎస్పీ, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితి, స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు, కేసు ప్రాపర్టీల భద్రత వంటి కీలక అంశాలను నిశితంగా సమీక్షించారు.

అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు, నిరంతరం అందుబాటులో ఉండే విధంగా పోలీసు అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజలకు న్యాయం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు, సేవల అందజేత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించడంలో పోలీసులు ముందుండాలని, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, డయల్-100 ట్యాబ్‌ల పనితీరు, సీసీటీవీ కెమెరాలు, నమోదు విధానం, డేటా అప్‌డేషన్ ప్రక్రియలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్లలో 5ఎస్ నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రతి ఫిర్యాదు, కేసు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్పీ వారి పనితీరుపై సమీక్ష జరిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని మర్యాదపూర్వకంగా స్వాగతిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయాన్ని వేగంగా అందించాలని స్పష్టం చేశారు.
















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370